


# సెబ్ పోయే.. ఎక్సైజ్ వచ్చే..

» స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దు » మళ్లీ పాత ఎక్సైజ్ విధానమే అమలు » కేబినెట్ నిర్ణయం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) రద్దయింది. దీని స్థానంలో తిరిగి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ పునరుద్ధరిస్తున్నారు. 2020లో వైసీపీ ప్రభుత్వం ఎక్సైజ్‌ను నిర్వీర్యం చేసి సెబ్‌ను తెరమీదకు తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ డిపార్ట్‌మెంట్‌కు రెండు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. మద్యం తాగడం నియంత్రించడం, వినియోగం తగ్గించడం, అక్రమ మద్యం అమ్మకాలు లేకుండా చూడడంతోపాటు నాటుసారా లేకుండా చేయడం వంటివి ఓ లక్ష్యం కాగా, ఇసుక అక్రమాలు జరగకుండా చూడడం మరొక లక్ష్యం. కానీ ఇసుక, గంజాయి వంటి విషయాల్లో కేసులు పెట్టి అరెస్టు చేసే అధికారం సెబ్‌కు లేదు. కేవలం నాటుసారా వరకూ మాత్రం అరెస్టు చేసే అధికారం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఏం చెప్పిందంటే ప్రజలు భౌతికంగా, ధృడంగా, ఆరోగ్యంగా జీవించడం కోసం మద్యం నియంత్రణకు ఈ డిపార్ట్‌మెంట్ తెస్తున్నట్టు చాలా గొప్పగా చెప్పింది. కానీ కేవలం వైసీపీ ప్రభుత్వం చెప్పినట్టు నడుచుకోవడానికే సెబ్‌ను తెచ్చినట్టు క్రమేణా అందరికీ అర్థమైంది. గతంలో ఉన్న ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ విధానాన్ని మార్చేసి ఆ ఉద్యోగులను సెబ్‌లోకి మార్చారు. జిల్లాకు ఒక ఏఎస్పీ స్థాయి అధికారితోపాటు 8 మంది సీఐలు, 10 మంది ఎస్‌ఐలు, 13 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 51 మంది కానిస్టేబుళ్లు ఐదుగురు జూనియల్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ సెబ్‌కు పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వకపోవడంతో కేవలం పేరుకే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా మిగిలింది. గత ప్రభుత్వం చేసిన తప్పులను, దోపిడీని చూసీచూడనట్టు వదిలేయడమే వీరి పనిగా మారింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో సెబ్‌ను రద్దు చేసి, ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించడానికి నిర్ణంచారు. అనంతరం సెబ్‌ను రద్దుచేస్తూ ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. దీంతో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అమలులోకి రానుంది.. జిల్లాకు ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, పోస్టులను ఇవ్వనున్నారు. అంతేకాక అసిస్టెంట్ కమిషనర్ పోస్టు కూడా రానున్నట్టు చెబుతున్నారు. ఇక సీఐలు, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, ఆఫీసు స్టాఫ్ మామూలే. సెబ్ ఉన్నప్పుడు మద్యం షాపుల జోలికి వెళ్లలేదు. ఇక ఎక్సైజ్ ఆధ్వర్యంలో కొత్త మద్యం పాలసీ రానుంది. కానీ రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఉండేది. సొంత భవనాలుండేవి. వాటిని గత కలెక్టర్ తొలగించి, ప్రత్యేక సమావేశాలకు క్యాంపు ఆఫీసు నిర్మించారు.

# ఉల్లి.. కొంటే కన్నీళ్లే!



» మహారాష్ట్రలో భారీ వర్షాలతో కొత్త పంటకు తీవ్ర నష్టం.. పడిపోయిన దిగుమతులు
» మరో రెండు నెలలు ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా » రైతు బజార్లలోనే కిలో రూ.48, బహిరంగ మార్కెట్లో ఏకంగా రూ.70 పైనే

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28: ఉల్లిపాయలు... కొనాలంటేనే కాదు, వాటి ధరలు విన్నా కూడా కన్నీళ్లే అన్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్లతోపాటు బహిరంగ చిల్లర మార్కెట్లలో ఉల్లిపాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లి ధరల దూకుడు చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్లకు రాకపోవడం, మహారాష్ట్ర ఉల్లిపాయలపైనే అంతా ఆధారపడాల్సి రావడంతో ధరల పెరుగుదలకు అడ్డూ అదుపూలేకుండా పోయింది. మహారాష్ట్రలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొత్త పంట చాలా వరకూ దెబ్బతినడంతో ఉల్లిపాయల లోడులు పెద్దగా రావడంలేదని, దీంతో మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేక ధరలు పెరుగుతున్నాయని ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర ఉల్లిపాయలు తప్ప మనకు మరో గత్యంతరం లేకపోవడంతో పెరిగిన ధరల భారాన్ని ప్రజలు మోయకతప్పడంలేదు. రాజమహేంద్రవరంలోని రైతు బజార్లలోనే ఉల్లిపాయలు కిలో రూ.48కు విక్రయిస్తున్నారంటే ధరల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఇక బహిరంగ మార్కెట్లలో వ్యాపారులు టైమింగ్‌ను బట్టి కిలో ఉల్లి రూ.60 - రూ.70 వరకూ ధర చెబుతున్నారు. ఇళ్ల దగ్గరకు తెచ్చి ఆటోల్లో విక్రయించేవారు రెండు కిలోల ఉల్లిపాయలనే రూ.120కు విక్రయించడం గమనార్హం. మొన్నటివరకూ రూ.100కు కనీసం నాలుగు కిలోలైనా ఇచ్చే ఆటోవాలాలు ధరలు భారీగా పెరగడంతో విక్రయించడం మానుకున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని హోల్‌సేల్ మార్కెట్లో నెంబర్-1 ఉల్లిపాయలు కిలో రూ.45 రూ.47 మధ్య ధర పలుకుతోంది. రైతు బజార్లు, ఇతర చిల్లర మార్కెట్లలో విక్రయించే కిలో ఉల్లి హోల్‌సేల్‌లోనే రూ.40పైనే ఉంది.

● కర్నూలు పాయలు అందుకుని ఉంటే..

సాధారణంగా ఆగస్టు నెలాఖరుకల్లా మహారాష్ట్ర కొత్తపాయలు మార్కెట్లోకి నెమ్మది నెమ్మదిగా రావడం మొదలవుతుంది. ఇదే సమయంలో కర్నూలు ఉల్లి కూడా అందుకుంటుంది. వర్షాలు, ఇతర వాతావరణ మార్పులతో ఇప్పుడా పరిస్థితి పూర్తిగా తారుమారైంది. అటు మహారాష్ట్ర నుంచి కొత్తపాయలు రావడంలేదు. ఇటు కర్నూలు ఉల్లి అందుకోలేదు. ఇటీవల మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు కొత్త పంట చాలావరకూ దెబ్బతినడంతో ఆ ప్రభావం జిల్లా మార్కెట్లపై పడింది. కర్నూలులోనూ వర్షాలకు పంట దెబ్బతిన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లిపాయలన్నీ పాతపాయలే. సెప్టెంబరులో మహారాష్ట్ర పాయలు వస్తే ధరలు తగ్గే అవకాశం ఉంది.

● మరో రెండు, మూడు వారాలు ధరాభారమే

ఉల్లి ధరాఘాతం మరో రెండు మూడు వారాలు ఉండొచ్చని హోల్‌సేల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్ర నుంచైనా, కర్నూలు నుంచైనా కొత్త పంట వస్తేనే తప్ప ధరలు దిగిరావని చెబుతున్నారు. అప్పటివరకూ మహారాష్ట్ర పాత ఉల్లిపాయలే మార్కెట్‌ను శాసిస్తాయి. దీంతో ధరల్లో పెరుగుదల తప్పదు. ఈ నేపథ్యంలో ఉల్లి ధరల నియంత్రణకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1న ఇవ్వాల్సిన పింఛన్లు ఒకరోజు ముందే పంపిణీ చేయబోతున్నారు. ఆరోజు ఆదివారం కావడంతో ఆగస్టు 31నే పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 30న డబ్బులు డ్రా చేసుకుని వెళ్లేలా ఆదేశాలిచ్చారు. 31న ఎవరికైనా అందకపోతే సెప్టెంబరు 2న పంపిణీ చేసే అవకాశం ఉంది.



అదుపు తప్పి మురుగు కాల్వలో దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

## మురుగు కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు

ఆర్టీసీ బస్సు అదుపుతప్పి మురుగుకాల్వలోకి దూసుకెళ్లిన సంఘటన ఇది. దేవరపల్లి మండలం సంగాయిగూడెం- చిన్నాయిగూడెం గ్రామాల మధ్యలో బుధవారం మధ్యాహ్నం నిడదవోలు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిన్నాయిగూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కన ఉన్న మురుగు కాల్వలోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. ఈ బస్సులో 40 మంది ప్రయాణిస్తున్నారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు ఎక్స్‌కవేటర్ సాయంతో బస్సును బయటకు తీశారు. వేరే బస్సులో ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు పంపించారు. - దేవరపల్లి

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి : డీఆర్వో

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి అభ్యర్థి ఎంపికకు తూర్పు, పశ్చిమ గోదావరి నియోజకవర్గాల ఎలక్టోరల్ రోల్స్‌లో నమోదుకు షెడ్యూలు జారీకానుందని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో, ఉన్నత విద్యాసంస్థల్లో ఆరేళ్లలోపు కనీసం మూడేళ్లపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారు ఓటరుగా నమోదైన మండలంలో ఎంపీడీవోకి నిర్ణీత దరఖాస్తు సమర్పించాలని డీఆర్వో సూచించారు. సెప్టెంబరు 9లోపు సర్వీసు సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్ కార్డు జతచేసి దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తుకు అవసరమైన ఫారం-19 అన్ని తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని ఆయన తెలియజేశారు




కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

## ఖరీఫ్ 2024-25 ధాన్యం సేకరణకు ముందస్తు కార్యాచరణ

ఈ-పంట నమోదు అక్టోబరు 1వ తేదీలోగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 28: రైతులకు కనీస మద్దతు ధర అందించడమే లక్ష్యంగా, వారి అభీష్టం మేరకే ఆయా మిల్లులకు పంపడంతోపాటు మిల్లు సామర్థ్యం మేరకు మాత్రమే మిల్లర్లకు లక్ష్యాలు ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్ల అసోషియేషన్ ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లుల సామర్థ్యాన్ని అనుసరించి లక్ష్యాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ధాన్యం సేకరణకు పౌర సరఫరాలశాఖతోపాటు రెవెన్యూ యంత్రాంగం కూడా భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌లను గుర్తించి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సౌకర్యం ఉండేలా రవాణా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైసుమిల్లు వద్ద ఎక్కువ సమయం వాహనాలు వేచి ఉండే అవకాశం లేకుండా మిల్లర్లు తగిన ఏర్పాట్లు చేసుకోవడంతోపాటు తగినంతగా హమాలీలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్, ఈ పంట నమోదులను అక్టోబరు 1వ తేదీలోగా పూర్తిచేయాలని జేసీ ఎస్.చినరాముడు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ లశితోష్ ప్రసాద్, ఆర్డీవో శివజ్యోతి, జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

## పరిశ్రమల సేఫ్టీ ఆడిటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 28: పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు జిల్లాస్థాయి భద్రత పర్యవేక్షణ కమిటీ సభ్యులు చురుకైన పాత్ర పోషించే క్రమంలో చెక్‌లిస్టు రూపొందించుకొని క్షేత్ర స్థాయిలో కార్యాచరణకు సిద్ధంకావాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. పరిశ్రమల భద్రతపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన తర్వాత నివారణ చర్యలు చేపట్టడంకంటే ముందస్తుగా ప్రమాదాలు గుర్తించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవడంపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా జిల్లా స్థాయిలోని పరిశ్రమల భద్రత కమిటీ సభ్యులతో కూడిన బృందం వివిధ పరిశ్రమలను పరిశీలించి అక్కడ చేపడుతున్న రక్షణ తదితర అంశాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. అగ్నిమాపక ప్రమాదాల నివారణకు సంబంధించి చేపడుతున్న జాగ్రత్తలు, గుర్తించిన లోటుపాట్లపై నివేదిక అందజేయాలన్నారు. స్థానికంగా ఏర్పాటుచేసిన పరిశ్రమల ద్వారా సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న పనులు ఆ ప్రాంతం వారికి ప్రయోజనకరంగా ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.రవిశంకర్, కార్మిక అధికారి బీఎస్ఎన్ఎల్ వలీ, సీపీవో అప్పలకొండ, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, మార్టిన్ లూథర్‌కింగ్, అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో నటిని వేధించిన వారిపై సమగ్ర విచారణ చేయాలి : ముప్పాళ్ల

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ముంబైకి చెందిన ఒక నటిని ఏపీ పోలీసులు, వైసీపీ నేతలు దారుణంగా వేధించిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. మహిళల హక్కులను ధ్వంసం చేసేవిధంగా పనిచేసిన వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్, పోలీస్ అధికారులు సీతారామాంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్‌గున్నిని శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. బాధితురాలికి రక్షణ కల్పించి, ఆమెపై పెట్టిన కేసులపై పునర్విచారణ చేయాలని పేర్కొన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టరు ప్రశాంతి

## ఆర్‌బీఐ క్విజ్ పోటీలకు డిగ్రీ విద్యార్థులు నమోదుచేసుకోవాలి

జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.10 లక్షలు : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భారత రిజర్వుబ్యాంకు స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు డిగ్రీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ని బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ పోటీల్లో ఏ కళాశాల విద్యార్థులైనా పాల్గొనవచ్చని తెలిపారు. https://www.rbi90quiz.in వెబ్‌సైటులో రిజిస్టరు చేసుకోవాలన్నారు. కనీసం ఇద్దరు విద్యార్థులు, ఆపై ఉండేలా విద్యార్థులు బృందంగా ఏర్పడి సెప్టెంబరు 17లోపుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ రూ.1.50లక్షలు, తృతీయ రూ.1 లక్ష, జోనల్‌స్థాయిలో రూ.5 లక్షలు, రూ.4 లక్షలు, రూ.3 లక్షలు, జాతీయ స్థాయి ఫైనల్ రౌండ్‌లో ప్రథమ బహుమతిగా రూ.10 లక్షలు, ద్వితీయ రూ.8 లక్షలు, తృతీయ రూ.6 లక్షలు లభిస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనడానికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి నరసింహం, లీడ్‌బ్యాంకు మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎంప్యానల్‌మెంట్ కమిటీ తొలి సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28: జిల్లా స్థాయి ఎంప్యానల్‌మెంట్ కమిటీ తొలి సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశం ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తొమ్మిది డీసిల్టేషన్ రీచ్‌లను గుర్తించామన్నారు. పర్యావరణ అనుమతుల తర్వాత కార్యాచరణకు అనుగుణంగా ఇసుక తవ్వకాలు బోట్స్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని కోసం జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్యారేజీకి సంబంధించి ఫోర్‌షోర్ ప్రాంతంలో బోట్స్‌మెన్ సొసైటీలు నిర్వహించే డిసిల్టేషన్ ఆపరేషన్‌లో తవ్వకంచేసిన మెటీరియల్ రవాణా, అప్పగించే పద్ధతిపై నిర్ణయం తీసుకోవాల్సిఉందన్నారు. కాగా కమిటీలో జిల్లా స్థాయిలో జేసీ ఛైర్మన్‌గా, సమన్వయకర్తగా గోదావరి డెల్టా సిస్టమ్ ధవళేశ్వరం చీఫ్ ఇంజనీర్ ఉంటారు. సభ్యులుగా ఈఈ గోదావరి హెడ్‌వాటర్ వర్క్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, డీపీవో, జిల్లా గనులు అండ్ జియాలజీ అధికారి, జిల్లా సహకార అధికారి, కొవ్వూరు సబ్‌కలెక్టర్, రాజమహేంద్రవరం రెవెన్యూ అధికారి, అన్ని మండలాల తహశీల్దార్లు నియమితులయ్యారు.

# 'సచివాలయాలు' చక్కదిద్దేలా..




ఇప్పటిదాకా దశ దిశ లేని సచివాలయ వ్యవస్థ
ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనూ గందరగోళం
సిబ్బంది సహేతుక క్రమబద్ధీకరణకు సీఎం నిర్ణయం
ఇంజనీరింగ్ అసిస్టెంట్ల విషయంలోనే సందిగ్ధం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

**కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలను సమర్థవంతంగా పనిచేయించడం మొదలైంది. గాడిలో పెట్టే దిశగా ఇప్పటికే సీఎం చంద్రబాబు అత్యున్నత స్థాయి సమావేశంలో కూడా ప్రస్తావించారు. సిబ్బందిని సహేతుకంగా క్రమబద్ధీకరించి మానవ వనరులను ప్రజా సేవకు మరింత మెరుగ్గా వినియోగించుకోవాలని నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ లబ్ధి, ప్రచార ఆర్భాటంకోసం జగన్ ఏర్పాటుచేసిన గ్రామ, వార్డు సచివాలయాలు అస్తవ్యస్తంగా మారాయి. జాబ్ చార్టుకు సంబంధం లేకుండా సొంత పనులతో వైసీపీ నేతలు పెత్తనం చెలాయించారు. దీంతో ప్రజా సేవలు కుంటుబడ్డాయి. కూటమి ప్రభుత్వం సచివాలయాల సిబ్బందితో పింఛన్లను ఇంటింటికీ పంపించడంలో ఇప్పటికే విజయం సాధించింది. దీంతో సచివాలయాలను సవ్యదిశలో పెడితే ప్రజలు మరింతగా ఉపయోగపడతాయనే వాస్తవం వెలుగు చూసింది. దీంతో అవసరమైన మేరకే సిబ్బందిని సచివాలయాల్లో ఉంచి మిగతా వారిని మాతృశాఖలకు పంపించాలని సీఎం యోచిస్తున్నారు.**

గ్రామ, వార్డు సచివాలయాల్లో 11 మంది సిబ్బంది అని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఆ లెక్క ఎప్పుడూ సరిపెట్టలేదు. తర్వాత ఎన్నికలకు ముందు సర్దుబాటు పేరుతో ముగ్గురికి కోత విధించి 8తో సరిపెట్టింది. ప్రస్తుతం జిల్లాలో రూరల్ మండలాల్లో 393, అర్బన్‌లో 119 సచివాలయాలు కలిపి మొత్తం 512 ఉండగా.. 8 మంది సిబ్బందికంటే తక్కువగా 116 ఉంటే, 8 మందికంటే ఎక్కువగా 262 మంది ఉన్నారు. 8 మంది సిబ్బంది ఉన్న సచివాలయాలు 134 ఉన్నాయి. వార్డు సచివాలయాలు 119 ఉన్నాయి. రూరల్ సచివాలయాల్లో 3140, అర్బన్‌లో 940 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అత్యధిక సచివాలయాల్లో 10 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా రాజమహేంద్రవరం అర్బన్‌లో 8 కంటే ఎక్కువగా సిబ్బంది ఉన్న సచివాలయాలు 29 ఉన్నాయి. తర్వాత స్థానాల్లో కోరుకొండ-22, నిడదవోలు-21 ఉన్నాయి. కొన్నిచోట్ల పని ఒత్తిడి ఎక్కువగా ఉండడం, మరికొన్నిచోట్ల పనిలేకపోవడాన్ని ఇప్పటికే కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీంతో వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకునే పనిలో భాగంగా ఆ సంఖ్యను క్రమబద్ధీకరించాలని తాజాగా కూటమి ప్రభుత్వం సూచనప్రాయంగా నిర్ణయించింది.

● మాతృ శాఖకు ఎవరు?

గ్రామాల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్ 5), గ్రామ రెవెన్యూ అధికారి, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఫిషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. పట్టణాల్లోని సచివాలయాల్లో వార్డ్ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్, అడ్మినిస్ట్రేటివ్, మహిళా పోలీస్, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్, ఎమెనిటీస్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, రెవెన్యూ, హెల్త్ కార్యదర్శులు, ఎనర్జీ అసిస్టెంట్‌లు ఉన్నారు. వీరి సర్వీసు రిజిస్టర్లు వగైరా ఆయా డిపార్టుమెంట్ల పరిధిలోనే ఉంటాయి. అయితే రూరల్ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్, హార్టికల్చర్, ఫిషరీష్ అసిస్టెంట్‌లను మాతృశాఖలకు పంపించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఎనర్జీ అసిస్టెంట్లు సచివాలయాల్లో పనిచేయడం లేదు. దీంతో వీళ్లు విద్యుత్‌శాఖలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక వార్డు సచివాలయాల్లో అడ్మిన్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి, శానిటేషన్ కార్యదర్శి, ఏఎన్ఎం, మహిళా సంరక్షణ కార్యదర్శులను కొనసాగిస్తారు. మిగిలిన వారిని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖకు అప్పగిస్తారు. సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్/హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్, పశు సంవర్థక సహాయకుల పోస్టులను ఇకపై రద్దు చేయనున్నారు. వారిని క్లస్టర్ విధానంలో మాతృశాఖల అధీనంలోకి తీసుకెళ్తారు.

● సందిగ్ధం ఇదేనా..!

సచివాలయాల సిబ్బంది గతంలో వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేసేలా పూర్తిస్థాయిలో వినియోగించుకున్నారు. ఆ సిబ్బందికి ఒక పని అని నిర్దిష్టంగా ఉండేది కాదు. పైఅధికారులు, వైసీపీ నాయకులు ఏది ఆదేశిస్తే అది పాటించాల్సిందే. అయితే ఇప్పుడు సీఎం చంద్రబాబు తీసుకోనున్న నిర్ణయంపై సచివాలయ ఉద్యోగుల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. కానీ ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో అంతర్మథనం కొనసాగుతోంది. జిల్లాలోని అర్బన్ సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు 85 మంది, రూరల్ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 340, సర్వే అసిస్టెంట్లు 360 మంది ఉన్నారు. అర్బన్ సచివాలయాల్లోని ప్లానింగ్ కార్యదర్శులను మునిసిపాలిటీలకు పంపించినా రూరల్ సచివాలయాల్లోని ఇంజనీరింగ్, సర్వే అసిస్టెంట్లను ఏ శాఖకు పంపిస్తారో అనే ప్రశ్న చర్చనీయాంశమైంది. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు కేటాయిస్తారని అనుకున్నారు. అయితే వీళ్లను ఇరిగేషన్ శాఖకు కేటాయిస్తారనే వాదన నడుస్తోంది. సివిల్‌తోపాటు మెకానికల్ చదివిన వారు కూడా ఉన్నారు. అందువల్ల ఇరిగేషన్‌కి అయితే పూర్తిగా ఉపయోగపడతారని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల అవసరత పెద్దసంఖ్యలో ఉంది. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పెద్దసంఖ్యలో పోలవరం ప్రాజెక్టుకు కేటాయించే అవకాశం లేకపోలేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రధానంగా గ్రామాల్లోని ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, జల్‌జీవన్ మిషన్, పంచాయతీ రాజ్ వర్కులు, రోడ్లు, డ్రైన్లు, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ వంటి ఇంజనీరింగ్ సంబంధిత నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. వీరికి ఎంబుక్ నమోదు చేసే అధికారం ఇవ్వడంతో చాలా మటుకు ఉపయోకరమైందని చెబుతున్నారు. వీటికోసం మండల ఇంజనీరింగ్ అధికారి, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆయా గ్రామాలకు రావాలంటే తాత్సారం జరిగేదని, బిల్లుల నమోదు, ఎంబుక్‌ల రికార్డింగ్ వంటికి చాలా ఆలస్యం అయ్యేవని.. ఇప్పుడు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉండడంతో ఇబ్బంది తప్పిందంటున్నారు. ఇక బదిలీల ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులకు మ్యూచువల్, రిక్వెస్టు బదిలీలు జరుగుతున్నాయి. త్వరలోనే సర్దుబాట్ల నిర్ణయం వెలువడవచ్చు.

రూరల్‌లో సచివాలయ సిబ్బంది..

| హోదా | సంఖ్య |
|---|---|
| వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ | 376 |
| మహిళా పోలీస్ | 360 |
| డిజిటల్ అసిస్టెంట్ | 360 |
| పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్ 5) | 209 |
| గ్రామ రెవెన్యూ అధికారి | 219 |
| సర్వే అసిస్టెంట్ | 365 |
| ఇంజనీరింగ్ అసిస్టెంట్ | 347 |
| హార్టికల్చర్/అగ్రికల్చర్ అసిస్టెంట్ | 320 |
| ఏఎన్ఎం | 380 |
| వెటర్నరీ/ఫిషరీస్ అసిస్టెంట్ | 199 |

అర్బన్‌లో సచివాలయ సిబ్బంది..

| హోదా | సంఖ్య |
|---|---|
| వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ | 114 |
| మహిళా పోలీస్ | 115 |
| అమెనిటీస్ సెక్రటరీ | 98 |
| పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్ 5) | 209 |
| ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ | 117 |
| అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ | 100 |
| ప్లానింగ్/రెగ్యులేషన్ సెక్రటరీ | 85 |
| శానిటేషన్/ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ | 90 |
| రెవెన్యూ సెక్రటరీ | 116 |
| హెల్త్ సెక్రటరీ | 109 |

జిల్లా అధికారి లేరండీ...

గ్రామ, వార్డు సచివాలయాల డిపార్టుమెంటు కొత్త వ్యవస్థ. దాంతో నిబంధనలనూ పక్కాగా రూపొందించాల్సి ఉంది. కానీ అలా జరగలేదు. సచివాలయాలు తీసుకొచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి పోస్టును సృష్టించారు. కానీ దానికి అధికారిని నియమించకుండా డీఎల్‌డీవోలకు, డీఆర్‌డీఏ పీడీలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కాలం గడిపారు. అభివృద్ధి విభాగానికి జాయింట్ కలెక్టర్ ఉండేవారు. వారు సచివాలయ బాధ్యతలూ చూసుకొనేవారు. కానీ తర్వాత ఆ పోస్టును పట్టించుకోలేదు. పంచాయతీరాజ్‌శాఖలోని ఎండీవోలకు ప్రమోషన్ ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమిస్తారు. వారిలో సీనియర్‌ని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారిగా నియమించాలి. జిల్లాలో రెండు డివిజన్ల ఇద్దరు డీఎల్‌డీవోలకు సచివాల యాల అదనపు బాధ్యత అప్పగించారు. కానీ సచివాలయాలశాఖ ఏ డిపార్టుమెంటు పరిధో స్పష్టత లేదు. ఈ సమస్యలన్నిటికీ ప్రభుత్వం పరిష్కారం చూపే కసరత్తు మొదలెట్టింది.



యువకులకు సంఘీభావం తెలుపుతున్న మురళీకృష్ణ

# యువ చైతన్య యాత్ర

మండపేట, ఆగస్టు 28: మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు, హత్యలపై ప్రజలను చైతన్యపరిచేందుకు ముగ్గురు యువకులు నడుంబిగించారు. విజయవాడ నుంచి కోల్‌కతా పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతపురానికి చెందిన ప్రదీప్‌కుమార్, అన్నవరానికి చెందిన ఆకేటి సూరిబాబు, హైదరాబాద్‌కు చెందిన దొంత రాధాకృష్ణ ఈ నెల 21న విజయవాడలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద పాదయాత్ర ప్రారంభించారు. వారు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడికి చేరుకోగా బీజేపీ నాయకుడు టి.మురళీకృష్ణ కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ కోసం చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని, దాడులకు అత్యాచారాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, కోల్‌కతాలోని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద ముగుస్తుందని చెప్పారు.

# 12 నుంచి పవిత్రోత్సవాలు

అంతర్వేది, ఆగస్టు 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సెప్టెంబరు 12 నుంచి 15వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, అధివాసాలు, 13, 14 తేదీల్లో ఉదయం అలంకార తిరుమంజనాలు, ప్రాయశ్చిత్త హోమాలు, పవిత్రారోహణ, 15న మహా శాంతి హోమం, పూర్ణాహుతి, గ్రామోత్సవం, రాత్రి పవిత్ర అవరోహణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రాల వినియోగం జరుగుతాయని అర్చకులు తెలిపారు.

# 25 లక్షల కోట్ల బకాయిల రద్దు వెనుక భారీ స్కామ్

- పోలవరం అవకతవకలపై విచారణ జరపాలి
- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28: ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల కాలంలో రూ.25లక్షల కోట్ల బకాయిలను రద్దు చేయించడం వెనుక భారీ స్కామ్ జరిగిందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనలాంటి వారు బ్యాంకు రుణం తీసుకుంటే ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు బడా కార్పొరేట్ సంస్థలకు మాత్రం రుణ మాఫీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 25లక్షల కోట్ల అప్పులను రద్దు చేయించిన వారి పేర్లను బయటపెట్టాలని కోరుతూ ప్రధాని మోదీకి, ఆర్‌బీఐ గవర్నర్‌కు లేఖలు పంపానన్నారు. పోలవరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మించాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల్లో సీట్ల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలపై మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విచారించాలన్నారు. విశాఖ పోర్టులో పట్టుబడిన 25వేల కిలోల కొకైన్ కేసులో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజ్యాంగ సవరణ జరగకుండా ఎస్సీ వర్గీకరణ చెల్లదని, అందుకే తాను సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశానన్నారు. క్రీమీలేయర్ విధానంతో అట్టడుగు దళితులు నష్టపోతారని, వచ్చేనెల 17న తన పోరాట కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

# టీడీపీ కార్యకర్తపై వైసీపీ నాయకుల దాడి


గాయపడ్డ నాయుడు

కోటనందూరు, ఆగస్టు 28: కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎస్ఆర్ పేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుసిరెడ్డి వీరవెంకట సత్య మణికంఠ నాయుడిపై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరిచారు. మణికంఠనాయుడు మంగళవారం రాత్రి భీమవరపుకోటలోని చెల్లెలి ఇంటికి వెళ్లి వస్తుండగా ఎస్ఆర్ పేట గ్రామ శివారులోని బ్రాందీ షాపు సమీపంలోని కల్వర్టు వద్ద అన్నంరెడ్డి మహేష్, అన్నంరెడ్డి సత్యనారాయణ, అన్నంరెడ్డి దుర్గాప్రసాద్, రుత్తల అయ్యప్ప దాడి చేశారు. గతంలో తన పెదనాన్న గొడవలను మనసులో పెట్టుకోవడంతో పాటు టీడీపీలో యాక్టివ్‌గా పని చేస్తుండడంతో ఈ దాడికి పాల్పడ్డారని బాధితుడు కోటనందూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.




# కొబ్బరి ఉప ఉత్పత్తులపై జాతీయ స్థాయిలో ప్రచారం చేయాలి

- దేశంలో 43వేల రకాల పంటల సాగు
- కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి
- రైతుల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా: ఎమ్మెల్యే ఆనందరావు
- అమలాపురంలో కొబ్బరి రైతుల జాతీయ సదస్సు


అఖిల భారత కొబ్బరి రైతుల సదస్సును జ్యోతిప్రజ్వలనతో ప్రారంభిస్తున్నజాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీమోహన్‌మిశ్రా, మాట్లాడుతున్న జాతీయ కన్వీనర్ సుందరరాజన్

అమలాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఉప ఉత్పత్తులపై జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మోహినీ మోహన్ మిశ్రా పేర్కొన్నారు. కొబ్బరి ఉప ఉత్పత్తులను తయారుచేసేందుకు రాయితీలతో పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశంలోని 127 క్లైమేటివ్ జోన్లలో 43వేల రకాల పంటలు సాగవుతున్నాయనివివరించారు. కొబ్బరి పండించే జోన్ నుంచే ఇస్రో, డీఆర్డీవోవంటి సంస్థల్లో ఎందరో శాస్త్రవేత్తలుగా ఎదిగారని రైతుల హర్షధ్వానాల మధ్య తెలిపారు. ప్రపంచంలో ఎత్తైన పంటను పండించే కొబ్బరి రైతులు తలెత్తుకునేలా తిరిగితేనే దేశం అభివృద్ధి బాటన నడుస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కొబ్బరి రైతుల జాతీయ సదస్సు నిర్వహించారు. తొలుత బీకేఎస్ పతాకాన్ని జాతీయ కన్వీనర్ సుందరరాజన్ ఆవిష్కరించారు. భరతమాత, బలరామకృష్ణుడు చిత్రపటాలకు పూజలు నిర్వహించి జ్యోతిప్రజ్వలన చేశారు. పార్టీలు వేరైనా.. కులాలు వేరైనా.. మతాలు వేరైనా.. పంటలు వేరైనా.. రైతులంతా ఒక్కటేనంటూ పిడికిలి బిగించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

సుందరరాజన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకటరాఘవులు, జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ కొవిడ్ విపత్తు సమయంలో అన్ని వ్యవస్థలూ నిలిచిపోయినా ప్రపంచవ్యాప్తంగా రైతులు మాత్రమే చేలల్లో దిగి పంటలు పండించారన్నారు. కొవిడ్‌తో ఏ ఒక్క రైతూ చనిపోలేదన్నారు. మన్‌కీ బాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ పనస పొట్టుపై మాట్లాడడంతో దానికి డిమాండు విపరీతంగా పెరిగిందన్నారు. 2026ని కొబ్బరి సంవత్సరంగా ప్రకటించి కొబ్బరిపై విస్తృత ప్రచారం నిర్వహించాల్సి ఉందన్నారు. 20 ఏళ్ల క్రితం కొబ్బరి కాయ ధర రూ.20 ఉంటే ప్రస్తుతం రూ.7కు పడిపోయిందని, దానికి తోడు నాణ్యత కూడా తగ్గిపోయిందన్నారు. కొబ్బరి రైతులను ఆదుకునేలా మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒడిసా నుంచి హాజరైన బీకేఎస్ నాయకులు తమ సమస్యలను వివరించారు. కర్ణాటక అధ్యక్షుడు గంగాధర్, తమిళనాడు అధ్యక్షుడు పార్థసారథి, వేటుకూరి సూర్యనారాయణరాజు, యాళ్ల దొరబాబు, రాష్ట్ర కార్యదర్శి కవులూరి పతిరాజు, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు, నడింపల్లి సీతారామరాజు, బీకేఎస్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు యాళ్ల వెంకటానందం, మాజీ అధ్యక్షుడు బొక్కా ఆదినారాయణ మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న



సమస్యలను సెప్టెంబరులో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నల రూపంలో తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. 1996 తుపాను తర్వాత కొబ్బరి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో వారి సమస్యలను గుర్తించికేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రధాన తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

## తీర్మానాలు ఇవీ

- కోనసీమలో కొబ్బరిని ప్రోత్సహించే విధంగా సీపీసీఆర్ఐ రీజనల్ రీసెర్చ్ సెంటరును కోనసీమలో ఏర్పాటు చేయాలి.
- అన్ని రకాల పంటలకు మూల్య వృద్ధి సేవలు, నూతన సాంకేతికతను రైతులకు బదిలీ చేసేందుకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి.
- కోనసీమలో కోకోనట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.
- ప్రస్తుతం ఉన్న ప్యాక్ హౌస్ స్కీమును మార్పులు చేసి కొబ్బరి కురిడీ తయారు చేసుకునేలా బాల్‌కోప్రా హౌస్ పేరుతో ఎక్కువ రాయితీ అందించాలి.
- ఆర్‌అండ్‌ఆర్ స్కీము ద్వారా దిగుబడి తక్కువ ఇచ్చే చెట్లను తొలగించి వాటి స్థానంలో అధిక దిగుబడులు ఇచ్చే పొట్టి రకాలను పెంచేలా మైక్రో న్యూట్రియంట్ ఎరువులను సరఫరా చేసే విధానం అమలు చేయాలి.
- కొబ్బరి పండించే ఎనిమిది రాష్ట్రాల రైతులు ఫోరంగా ఏర్పడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి.
- వ్యవసాయ ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా తక్కువ ధరతో కిసాన్ రైలు పేరిట రైల్వే రవాణా సదుపాయం కల్పించాలి.
- కోప్రాకు మద్దతు ధరపై కర్ణాటక ప్రభుత్వం ఇస్తున్న బోనస్ రూ.1,500 మాదిరిగానే కొబ్బరి పండించే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు బోనస్ ప్రకటించాలి.
- కొబ్బరిని ఎడిబుల్ ఆయిల్‌గా ప్రకటించి అన్ని రకాల పంటలకు వర్తించే అన్ని రాయితీలను వర్తింపజేయాలి.
- కొబ్బరిని కల్తీచేసే కెర్నాయిల్‌పై పూర్తి నియంత్రణ ఉండాలి.
- కొబ్బరి వినియోగం పెంచేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు చర్యలు తీసుకోవాలి.
- కొబ్బరిలో దింపు సమస్యను అధిగమించే విధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఉపయోగించి హార్వెస్టింగ్ చేసే యంత్రాలు తయారుచేయాలి.
- కొబ్బరి బోడకాయ ధర కిలో రూ.45గా నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయాలి.


గంజాయి రవాణా ముఠా వివరాలు వెల్లడిస్తున్న నల్లజర్ల సీఐ శ్రీనివాస్



గంజాయి నిందితుల వివరాలు చెబుతున్న చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా

# గంజాయి గుట్టురట్టు

**తూర్పు గోదావరి జిల్లా అనంతపల్లిలో 262 కిలోలు, ఏజెన్సీలో 265 కిలోలు పట్టివేత**

నల్లజర్ల, ఆగస్టు 28: కాకినాడ జిల్లా జగ్గంపేట నుంచి చెన్నైకి గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాను నల్లజర్ల పోలీసులు వలపన్ని పట్టుకుని అరెస్టు చేశారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను సీఐ ఎస్.శ్రీనివాస్ వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రవివర్మ రమేష్, సూర్య ధనేష్ మురగన్, జీవరత్నం గణేశం, అలుగు నవిన్ పళనిస్వామి కలిసి 262 కిలోల గంజాయి కొనుగోలు చేసి ఐషర్ వ్యాన్‌లో చెన్నైకి తరలిస్తున్నారు. సీఐ శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారంతో అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఐషర్ వ్యాన్ ముందు ఎస్కార్ట్‌గా ఎరుపు రంగు స్విఫ్ట్ కారు ఉంది. ఐషర్ వ్యానును ఆపి చూడగా గంజాయి బయటపడింది. ఐషర్ వ్యాన్, స్విఫ్ట్ కారు సీజ్ చేసి మొబైళ్లు స్వాధీనం చేసుకుని వారి వద్ద ఉన్న రూ.3,100 నగదు తీసుకుని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ శ్రీహరిబాబు, ఏఎస్ఐ మోహన్, హెచ్‌సీ స్టాలిన్, పృధ్వీరాజు, రవికుమార్, షేక్ రషీద్, తారకేశ్వర రావు, తేజేంద్రనాథ్‌లను తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ దేవకుమార్ అభినందించారు.

**చింతూరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు 265 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా వెల్లడించారు. మొదటి కేసులో తెలంగాణ రాష్ట్రం గోదావరి ఖనికి చెందిన నిమ్మల మణికంఠ ఒడిసాలో 20 కేజీల గంజాయి కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి మోతుగూడెం మీదుగా తెలంగాణకు తరలించే యత్నం చేశాడు. మోతుగూడెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడ్డాడు. రెండో కేసులో తెలంగాణ రాష్ట్ర యాదాద్రి భువనగిరికి చెందిన ధీరావత్ గణేష్ ఒడిసాలో 215 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. ఇతడు కూడా అక్కడి నుంచి మోతుగూడెం మీదుగా కారులో తరలిస్తూ పోలీస్ చెక్‌పోస్టు వద్ద దొరికిపోయాడు. మూడో కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలానికి చెందిన సోయం సందీప్, షేక్ హర్బజ్, కొర్సా నవీన్, నారకొండ ప్రకాష్, మినప హరిప్రసాద్‌లతోపాటు తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన సవలం ప్రకాష్, సానబోయిన శ్రావణ్‌కుమార్ పట్టుబడ్డారు. వీరంతా ఒడిసాలో 30 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. వీరంతా చింతూరు బస్టాండులో తెలంగాణ రాష్ట్రం వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తూ పోలీసులకు దొరికిపోయారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక మోటారు సైకిలును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం పట్టుబడ్డ 265 కిలోల గంజాయి విలువ రూ.13.25 లక్షలు ఉంటుంది. మూడు కేసుల్లో పోలీసులు తొమ్మిది మందిని అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.


మహ్మద్ రిహాన్ మృతదేహం

# మదర్సాలో బాలుడి మృతి

**అనుమానాస్పద మృతిగా కేసు నమోదు**

అంతర్వేది, ఆగస్టు 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలోని మదర్సా స్కూల్లో 4వ తరగతి చదువుతున్న మహ్మద్ రిహాన్ మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో మంచినీళ్లు తాగుతూ సొమ్మసిల్లి పడిపోయాడు. బాలుడు చనిపోయాడని భావించిన స్కూలు యాజమాన్యం హైదరాబాద్‌లో ఉంటున్న బాలుడి బావ మహ్మద్‌మెర్సిన్‌కు సమాచారం ఇచ్చింది. మహ్మద్ మెర్సిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. రిహాన్ తల్లిదండ్రులు జార్ఖండ్ రాష్ట్రం జెహిర్‌గట్ట గ్రామానికి చెందిన వారు. బాలుడి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించి పంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కుడుపూడి దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

# 56 మంది డిశ్చార్జి

**చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించిన కాకినాడ ఎంపీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే, ఆర్డీవో**

**సెలవులు ప్రకటించడంతో ఇళ్లకు తీసుకువెళ్లిన తల్లిదండ్రులు**


బాలికల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, ఆర్డీవో సీతారామారావు

ఏలేశ్వరం, ఆగస్టు 27: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికలను కాకినాడ


మంచాలు లేక పరుపులపై చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఆర్డీవో సీతారామారావు బుధవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలికల యోగక్షేమాలు, వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన చికిత్స అందించడంతో పాటు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. చికిత్స పొందుతున్న బాలికలకు ఎమ్మెల్యే పండ్లు పంపిణీ చేశారు. డీసీహెచ్ఎస్ స్వప్న మాట్లాడుతూ మంగళవారం రాత్రి 72 మందికి వైద్య సేవలు అందించగా బుధవారం ఉదయం మరో 17 మంది చేరారన్నారు. 6వ తరగతి చదువుతున్న జాస్మిన్‌ను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. బుధవారం సాయంత్రానికి కోలుకున్న 56 మందిని డిశ్చార్జి చేశామని చెప్పారు. తహసీల్దారు ఆర్వీ వెంకటేశ్వరరావు, జనసేన ప్రత్తిపాడు ఇన్‌చార్జి తమ్మయ్యబాబు, జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, నాని, కూటమి నాయకులు, కార్యకర్తలు బాలికల యోగక్షేమాలను అడిగి తెలుసున్నారు.

గురుకుల బాలికల సంక్షేమ పాఠశాల, కళాశాలను ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థినులకు పెట్టే మెనూ, వసతులు, తాగునీరు తదితర అంశాలపై ప్రిన్సిపాల్ చంద్రశారదను ఆరా తీశారు. వసతి గృహం, వంటశాల పరిసరాలను పర్యవేక్షించి విద్యార్థినుల ఆహారం, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పాఠశాల ఆవరణలోని తుప్పలను తొలగించి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు, తాగునీటి శాంపిల్స్‌ను జిల్లా కేంద్రానికి శాంపుల్స్ పంపించామని, రిజల్ట్ వచ్చిన తర్వాత సంబంధీకులపై చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిస్థితులు మెరుగుపడేవరకు సెలవులు ప్రకటించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. దీంతో తల్లిదండ్రులు వచ్చి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సచివాలయ ఉద్యోగులకు**

# నేడు కౌన్సెలింగ్

**కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో ఉదయం 8 గంటల నుంచి**

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 28: వార్డు, సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బదిలీలు కోరుకునే వారంతా తమ దరఖాస్తులను ఈ నెల 27వ తేదీలోపు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొంది. సంబంధిత శాఖల్లో ఖాళీల ఆధారంగా బదిలీ ప్రక్రియ జరగనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధి గల 319 వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల్లో బదిలీ కోరుకునే వారంతా సంబంధిత వెబ్‌సైట్‌లో ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అపాయింట్‌మెంట్ అథారిటీ పరిశీలించి కాకినాడ స్మార్ట్ సిటీలో గురువారం వీరందరికీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 319 సచివాలయాల ఉద్యోగులకు కాకినాడ స్మార్ట్ సిటీ హాలులో కమిషనర్ భావన ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. ఆర్‌డీఎంఏ పరిధిలో అడ్మిన్ సెక్రటరీలకు మండపేట కమిషనర్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు పెద్దాపురం కమిషనర్, వెల్ఫేర్ సెక్రటరీలకు పిఠాపురం కమిషనర్, శానిటేషన్ సెక్రటరీలకు తుని కమిషనర్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ పబ్లిక్ హెల్త్ (ఎస్ఈపీహెచ్) పరిధిలోని ఇమ్యూనిటీ సెక్రటరీలకు, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, ఆర్‌డీటీసీపీ పరిధిలో ప్లానింగ్ సెక్రటరీలకు ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ మొదలవుతుంది. కమిషనర్లతో పాటు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని సెక్షన్ల సూపరింటెండెంట్లు, గుమస్తాలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది సహకరించనున్నారు. బదిలీ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈ నెల 31వ తేదీలోపు జాయినింగ్ ఆర్డర్ ఇస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జోన్-2 ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

# 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో గంజాయిని మూలాలతో పెకిలిస్తాం

**ఆస్తి, సైబర్, మహిళలు, పిల్లలపై నేరాలను సహించేది లేదు**

**ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్**

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 'గంజాయిని అరికట్టడంపై తీవ్రంగా దృష్టిసారించాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాము. ఉత్పత్తి, విక్రయ, నిల్వ, వాడకందారులను వదిలేది లేదు. గంజాయి మహమ్మారిని మూలాలతో పెకిలించడానికి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో పక్కాగా సిద్ధమయ్యాం' అని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన రాజమహేంద్రవరంలోని తూర్పు గోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిషోర్‌తో కలిసి నేరాలపై సమీక్షించారు. ఆస్తి, సైబర్, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై కూడా దృష్టి పెట్టామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పాత నేరస్తులు, అసాంఘిక వ్యక్తుల కదలికలపై నిఘా ముమ్మరం చేశామన్నారు. విజిబుల్ పోలీస్, ఇన్విజిబుల్ పోలీసింగ్ విధానాలతో నేరాలను కట్టడి చేస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని, మిస్సింగ్ కేసుల్లో వేగంగా స్పందించాలన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్, నేరాలు, రోడ్డు ప్రమాదాల అదుపునకు జిల్లాలో తీసుకుంటున్న చర్యలను ఐజీకి ఎస్పీ నరసింహ కిషోర్ వివరించారు. గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని, స్నేహపూర్వక పోలీసింగ్‌కి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

# 'మారుతినగర్ సుబ్రమణ్యం' చిత్ర యూనిట్ సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 28: 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్లకు చిత్ర యూనిట్ ధన్యవాదాలు తెలిపింది. ఇప్పటివరకు విలన్, క్యారెక్టర్ యాక్టర్‌గా చేసిన రావు రమేష్ ప్రధాన పాత్రలో రూపొందిన ఈ చిత్రం నవ్వుల పువ్వులు పూయిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. విజయ యాత్రలో భాగంగా రాజమహేంద్రవరంలో సినిమా ప్రదర్శిస్తున్న శివజ్యోతి థియేటర్‌కి బుధవారం సాయంత్రం చిత్ర యూనిట్ విచ్చేసి సందడి చేసింది. లక్ష్మణ్ కార్య రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, శివన్నారాయణ, అన్నపూర్ణ తదితరులు నటించారు. పుష్ప డైరెక్టర్ సుకుమార్ భార్య తబిత ఈ చిత్రాన్ని సమర్పించారు. సినిమా ప్రమోషన్‌లో అల్లు అర్జున్ ఎంట్రీ కావడం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. వర్ధమాన నటుడు అంకిత్, నటి రమ్య పసుపులేటి, డైరెక్టర్ లక్ష్మణ్ స్క్రీన్ దగ్గర ఏర్పాటుచేసిన వేదిక దగ్గరకు వచ్చి ప్రేక్షకులతో ముచ్చటించారు. సినిమా పంపిణీ చేసిన మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ఉదయరాజు, సత్తి సత్తిరెడ్డి చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికారు. నటుడు అంకిత్ మాట్లాడుతూ తాను ఇంత వరకు 12 సినిమాల్లో నటించినా, ఈ సినిమాతోనే మంచి గుర్తింపు లభించిందన్నారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీసీ బస్సుకింద పడి మహిళ మృతి

కాకినాడ క్రైం, ఆగస్టు 28: కాకినాడలో బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు కిందపడి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రత్తిపాడు మండలం ధర్మవరం అంబేడ్కర్ కాలనీకి చెందిన గుమ్మళ్ల నాగరత్నం (35) బుధవారం రాత్రి కాకినాడ జగన్నాథపురం నుంచి యానాం రోడ్డు వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తోంది. ఆమె శివాలయం వద్దకు వెళ్లేసరికి అటువైపే కాకినాడ నుంచి అమలాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక చక్రం కింద ప్రమాదవశాత్తూ అదుపు తప్పి నాగరత్నం పడిపోయింది. ఆమె తలపై భాగం నుంచి బస్సు చక్రం ఎక్కడంతో తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాకినాడ వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏజెన్సీ సమాచారం

### రంపచోడవరం సబ్ కలెక్టర్ బదిలీ

రంపచోడవరం, ఆగస్టు 28: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడ వరం సబ్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన్ను విజయవాడలోని కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనరుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.


రాజకీయ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీతారాం

### లక్షా ఆరు వేల కుటుంబాలకు
# ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం**

ఎటపాక, ఆగస్టు 28: పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ఎనిమిది మండలాల్లోని లక్షా ఆరువేల కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం కోరారు. నందిగామ గ్రామంలో బుధవారం నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రీతినే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. కాంట్రాక్టర్లు, కమిటీల పేరుతో చర్చలకే ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సీఎం ముంపు మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్వాసితుల బాధలను తెలుసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేక పేదలకు ఉపాధి కరువైందని, ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎటపాక, కూనవరం మండలాల నుంచి కార్యకర్తలు, స్థానికులు హాజరయ్యారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవీ, నాయకులు ఆకిశెట్టి రాము, ఐ.పద్మ, సొందే రామారావు, కాకా అర్జున్, సోయం వీరమ్మ, పునులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీవో సింహాచలం

### నాణ్యమైన నిత్యావసరాలు సరఫరా చేయాలి

**ఐటీడీఏ పీవో సింహాచలం**


రంపచోడవరం, ఆగస్టు 28: ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఖరారు చేసిన వెండర్లు నాణ్యత గత నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం కోరారు. బుధవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సహకార సంస్థ, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, వెండర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టెంబరు నుంచి నవంబరు వరకు నిత్యావసరాలను తక్కువ ధరకు సరఫరా చేసేలా వెండర్లను ఖరారు చేశామన్నారు. సరఫరా చేసిన సరుకులకు బిల్లులు ఎప్పటికప్పుడు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు సీహెచ్ శ్రీనివాసరావు, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, జీసీసీ సీనియర్ మేనేజర్లు ముర్ల వెంకటనరసింహ రాజారెడ్డి, జి.చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏటీడబ్ల్యువో రామతులసి, ప్రధానోపాధ్యాయులు బీఎస్ కుమార్, ఎం.చిన్నిబాబు, వార్డెన్లు పాల్గొన్నారు.


చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి

### శిశు మరణాలను తగ్గిద్దాం... భవిష్యత్ తరాలను కాపాడదాం

మోతుగూడెం, ఆగస్టు 28: తులసిపాక పీహెచ్‌సీ పరిధిలోని లక్కవరంలో బుధవారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణులకు శిశు మరణాలపై తులసిపాక పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా 0-1 సంవత్సరాల పిల్లలకు జలుబు, దగ్గు, జ్వరం, డయేరియా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, నిమోనియా, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది తలెత్తడం, శ్వాసకోస ఇబ్బందులు ఉన్నప్పుడు, ఆస్తమా వచ్చినప్పుడు ఎలా గుర్తుపట్టాలో అవగాహన కల్పించారు. సాధారణమైన దగ్గు అని తేలికగా వదిలేయొద్దని, మూఢ నమ్మకాలను నమ్మకండని కోరారు. రాబోయే మూడు నెలలు అతి జాగ్రత్తగా ఉండాలన్నారు. మంచి పోషకాహారం తీసుకోవాలని కోరారు. శిశు మరణాలను తగ్గిద్దాం.... భవిష్యత్ తరాలను కాపాడదాం అని పిలుపునిచ్చారు. తులసిపాక పీహెచ్‌సీ పరిధిలోని ఐదు ఉప కేంద్రాల్లో శిబిరాలు నిర్వహించి చిన్నారులను పరీక్షించి మందులు ఇచ్చారు. సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### చింతూరు సీఐగా దుర్గాప్రసాద్



చింతూరు ఆగస్టు 28: చింతూరు సీఐగా తెల్లం దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన విజయవాడ సీఐడీ విభాగంలో విధులు నిర్వర్తించారు. దుర్గాప్రసాద్ గతంలో రంపచోడవరం, వర రామచంద్రాపురం మండలాల్లో ఎస్ఐగా పని చేశారు. ప్రస్తుత సీఐ గజేంద్రకుమార్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

### మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



మోతుగూడెం, ఆగస్టు 28: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వచ్చే నెల 5వ తేదీన మహా ధర్నా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను బ్రాంచి ప్రెసిడెంట్ టి.జగదీశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. బ్రాంచి సభ్యులు, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, మహిళా కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

### ఆశా కార్యకర్తను నియమించాలని వినతి

రంపచోడవరం, ఆగస్టు 28: మండలంలోని బోర్నగూడెంలో ఆశా కార్యకర్తను నియమించాలని కోరుతూ బుధవారం ఏడీఎం హెచ్‌వో జి.శిరీషను కలిసి వినతిపత్రం అందజేసినట్టు ఎంపీటీసీ వంశీ కుంజం తెలిపారు. గ్రామంలో ఆశా కార్యకర్త లేక గర్భిణుల నమోదు, చిన్నారులకు టీకాలు తదితర ప్రభుత్వ కార్యకలాపాల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఏడీఎంహెచ్‌వోను కలిసిని వారిలో బొబ్బా శేఖర్, చిరంజీవి ఉన్నారు.

### భార్యను హత్య చేసిన నిందితుడి అరెస్టు

● 14 రోజులు రిమాండ్

అనపర్తి, ఆగస్టు 28 : అనపర్తిలో సంచలనం రేకెత్తించిన హత్య కేసులో భార్యను హత్య చేసిన భర్తను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు. అనపర్తి ధరణికోట లో సోమవారం భార్య అరుణకుమారిని డంబెల్‌తో మోది హత్య చేసిన భర్త తుపాకుల సాయిని మంగళవారం రాత్రి రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రత్యామ్నాయ మార్గాలతో అదనపు ఆదాయం

**● పూలమార్కెట్ ప్రతినిధులతో సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి**


పూల రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కడియం, ఆగస్టు 28: పూల వ్యర్థాల నుంచి అదనపు ఆదాయం పొందడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో కడియపులంక పూలమార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ హోల్‌సేల్ పూలమార్కెట్ నిర్వాహకులు ప్రతీ రోజు ఇరిగేషన్ కాలువలో పూలవ్యర్థాలను వేయడం ద్వారా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా పూలవ్యర్థాల నుంచి అదనపు ఆదాయం పొందడం సాధ్యం అవుతుందన్నారు. అందుకు అనేక సానుకూల అంశాలు అందుబాటులో ఉన్నాయని వాటిని అధ్యయనం చేసి కొంత పెట్టుబడి పెట్టడం ద్వారా ఆదాయ వనరుగా మార్చుకోవడం సాధ్యమవుతుందన్నారు. పూలవ్యర్థాల డంపింగ్ యార్డు ప్రతిపాదన వలన ఉపయోగం కంటే ఇబ్బంది పరిణామాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పూలవ్యర్థాలను డీకంపోస్టు చేసి సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ చేయవచ్చని తెలిపారు. కూలింగ్ ప్రాసెసింగ్ విధానంతో పూలను ఎండబెట్టడం ద్వారా వాటి రంగు పోకుండా ఉండే సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకుని దేశీయ, విదూశీ మార్కెటింగ్ చేసుకునే వెసలుబాటు ఉందన్నారు. పూల నుంచి అగరబత్తీ, సుగంద ద్రవ్యాలు తయారు చేసే విధానం ఉందని తక్కువ పెట్టుబడి పెట్టడం కోసం ముందుకు రావాలని సూచించారు. డీపీవో పూలమార్కెట్ ఏరియాలో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పూలవ్యాపారులు గంగుమళ్ళ నాగేశ్వరరావు, పి వెంకన్నబాబు, పాటంశెట్టి సత్తిరాజు, జి దుర్గారావు, టి రామకృష్ణ, ఎం.వీరబాబు, ఈ దొరబాబు, ఏ త్రిమూర్తులు, సుబ్బరాజు, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, టూరిజం ఆర్‌డీవీ స్వామినాయుడు, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, ఎంపీడీవో కె.రత్నకుమారి, తదితరులు ఉన్నారు.

### సోలార్ రూప్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లుల ఆదా

**● ఏపీఈపీడీసీఎల్ ఈఈ శ్రీధర్‌వర్మ**

అనపర్తి, ఆగస్టు 28 : తక్కువ ఖర్చుతో ప్రతి ఇంటిపైనా సోలార్ రూప్‌టాప్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్‌వర్మ అన్నారు. బుధవారం అనపర్తి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సోలార్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ రూప్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు తక్కువ ఖర్చు అవ డమే కాకుండా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని అంతే కాకు ండా బ్యాంకుల ద్వారా రుణం కూడా మంజూరవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి స్లాబ్‌ల పైన సోలార్ రూప్ టాప్‌ను సులభతరంగా ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. సోలార్ ద్వార ఒక కిలోవాట్‌కు 120 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తద్వారా రూ. 1000వచ్చే బిల్లు రూ.338 మాత్రమే వస్తుందని కిలోవాట్‌కు ఏడాదికి రూ.8వేలు ఆదా కావడమే కాకుండా రూ.30వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా సోలార్ రూప్ టాప్‌కు సంబ ంధించిన బ్రోచర్లను ఆయన స్థానిక అధికారులతో కలిసి ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిరంజన్‌బాబు, ఎల్ఐ శేషగిరి, షిఫ్టు ఆపరేటర్ జ్యోతికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ బిల్లుల భారాన్ని ఉపసంహరించాలి

**● సీపీఎం డిమాండ్**

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28 : విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2000లో విద్యుత్ ధరల పెరుగుదలకు, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటంలో మృతి చెందిన రామకృష్ణ, విష్ణువర్ధనరెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ అదానీ కంపెనీ నుంచి స్మార్టు మీటర్లు రాష్ట్రానికి చేరుకున్నాయని, ప్రయోగాత్మకంగా ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో బిగించిన స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు ఆందోళన చేశారని, వీటివల్ల విద్యుత్ ధరలు పెరగడమే కాకుండా రైతుల 9 గంటల ఉచిత విద్యుత్‌కు మంగళం పాడే అవకాశం ఉందని అన్నారు. తక్షణం స్మార్టుమీటర్ల బిగింపు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్‌బాబు పాల్గొన్నారు.

### విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28 : విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని రాజమహేంద్రవరం విద్యుత్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ సీఐ నాగమోహనరెడ్డి అన్నారు, విద్యుత్ శాఖ, విజిలెన్స్ ఏపిటిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో గాడాల గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐతో పాటు ఎస్ఐ యు.రామకృష్ణ, ఎలక్ట్రికల్ ఏఈ, ఏఎల్ఎంలతో కలిసి విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

### నిరాడంబరంగా ఎమ్మెల్యే నల్లమిల్లి పుట్టినరోజు


విజయవాడలోని దుర్గామల్లేశ్వర స్వామి దర్శనం చేసుకుని వేద పండితుల ఆశీర్వాదం పొందుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు

అనపర్తి, ఆగస్టు 28: అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పుట్టిన రోజును బుధవారం నిరాడంబరంగా జరుపుకున్నారు. రోజంతా విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో గడిపారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రతియేటా తన పుట్టిన రోజున విజవాడ లోని అమ్మవారి ఆలయంలో గడపడం ఆనవాయితీగా వస్తోంది. ఈఏడాది కూడా ఆయన భార్య మహాలక్ష్మితో కలిసి పుట్టినరోజున అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వేద పండితుల ఆశీర్వాదం పొందారు. పుట్టిన రోజున ఎటువంటి ఆర్భాటాలకు పోకుండా ప్రజలంతా బాగుండాలని కోరుకుంటూ రోజంతా అమ్మవారి సమక్షంలో గడిపే ఇటువంటి నేతలు అరుదుగా ఉంటారని నియోజకవర్గంలోని అభిమానులు, కార్యకర్తలతోపాటు ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తూ ఎమ్మెల్యేకు శుభా కాంక్షలు తెలిపారు.

### గోకవరం, కోరుకొండలో మంచినీటికి కటకట

కోరుకొండ, ఆగస్టు28: మండలంలో గత వారం రోజులుగా భగవాన్‌సత్యసాయి పథకం ద్వారా మంచినీరు సరఫరా కాకపోవడంతో పలు గ్రామాలకు చెందిన ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 12గ్రామాల్లో భూగర్భజలాల్లో క్లోరైడ్ శాతం అధికంగా ఉండటంవల్ల భగవాన్ సత్యసాయిబాబా సహకారంతో కోరుకొండ మండలంలో పలు గ్రామాలకు గోదావరి జలాలను అందించే బృహత్తర కార్యక్రమాన్ని భగవాన్ సత్యసాయి బాబా సుమారు 15సంవత్సరాలు క్రితం చేపట్టారు. జిల్లాఏజెన్సీ ప్రాంతం గోకవరం, కోరుకొండ మండలాల్లో అనేక గ్రామాల్లో ప్రత్యేక మంచినీటి ట్యాంకులు నిర్మించి గోదావరి జలాలను పురుషోత్తపట్నం వద్ద శుద్ధిచేసి పైపులైన్ ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇటీవల తరుచుగా మంచినీటి పైపులైన్లు లీకవడం, పగిలిపోవడం, గేల్‌వాల్ పాడవడం వంటి కారణాలతో మంచినీరు సక్రమంగా అందడం లేదు. దీంతో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి భగవాన్‌సత్యసాయిబాబా గోదావరి జలాలు ప్రజలకు సక్రమంగా అందించే ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజానీకం కోరుతున్నారు.

### ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలి: ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండంలలోని ప్రజలందరికీ సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని బుధవారం విజయవాడ గొల్లపూడిలో గల గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం ఛీప్ ఇంజనీర్ సంజీవరెడ్డికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో భాగంగా 463 కిలోమీటర్ల మేర పైపులైన్ పనులకుగాను సుమారు రూ.345కోట్ల ఈ ప్రతిపాదనలో చేపట్టాలని కోరారు. రాజానగరం నియోజకవర్గం రూ.270కోట్ల అంచనా వ్యయంతో సమగ్రరక్షిత నీటి సరఫరా పథకానికి సంబంధించిన పనులకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. అదే విధంగా నియోజకవర్గంలో 1273సీసీ డ్రైన్ల నిర్మాణానికి రూ.87కోట్లు తక్షణమే మంజూరు చేయాలని ఆ వినతిపత్రంలో ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, డాక్టర్ అడపా శ్రీనివాస్ ఉన్నారు.

### నేటి నుంచి జీజీయూలో వాణి పథకంపై వర్క్‌షాప్

రాజానగరం, ఆగస్టు 28: గోదావరి గ్లోబల్ విశ్వ విద్యాలయంలో (జీజీయూ)ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో ఈనెల 29, 30 తేదీల్లో రెండు రోజులపాటు అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి యు.చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వేస్ట్ బ్యాటరీ నుంచి పర్యావరణంపై పడుతున్న ఇటీవల పరిణామాలు అనే అంశంపై జీజీయూలోని పెట్రోలియం విభాగం ఆధ్వర్యంలో ఈవర్క్‌షాప్ జరుగుతుందన్నారు. దీనికి దేశంలోని ప్రఖ్యాతిగాంచిన ధన్బాద్‌లోని ఐఐటీ ఏఎస్ఎం, వెల్లూరు లోని వీఐటి, విజయవాడలోని ఎస్ఆర్ఎం, ఫిక్కీ, హైదరాబాదులోని ఎన్ఐఆర్‌డీపీఎంల నుంచి ప్రముఖులు హాజరై ఈవర్క్ షాప్‌లో పాల్గొని కీలకోపాన్యాసం చేస్తారన్నారు. తూర్పుగోదావరి, విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు, పారిశ్రామి కవేత్తలు ఈవర్క్ షాప్‌కు హాజరవుతారన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సి పాల్ టి.జయానంద కుమార్, డీన్.ఎస్.లీలావతి, పెట్రోలియం విభాగాధిపతి, వర్క్ షాప్ కోఆర్డినేటర్ ఎం.డి అహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

### 'పుష్కరాలకు ముందు కడియం అభివృద్ధి'

కడియం, ఆగస్టు 28: పుష్కరాల సమయానికి కడియం ప్రాంతం అభివృద్ధి చేసే విధంగా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు చేస్తున్నట్లు ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తెలిపారు. కడియంలో బుధవారం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రసాద్ మా ట్లాడుతూ కడియం ప్రాంతాన్ని టూరిజంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కృషి చేస్తున్నారన్నారు. గ్రామసభలు ఏర్పాటుచేసి గ్రామాల అభివృద్ధికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు ఆలోచన చేయడం శుభపరిణామమని ప్రసాద్ అన్నారు. వచ్చేనెల 2న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా క్లీన్, గ్రీన్ ఆంధ్రప్రదేశ్‌కు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, మండల జనసేన అధ్యక్షులు ముద్రగడ జమీ, సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ, కడియపుసావరం సర్పంచ్ చెక్కపల్లి మురళి, వైస్ ఎంపీపీ పంతం గణపతి, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్, కూటమి నాయకులు కలిదిండి గోవిందు, వరగోగుల వెంకటేశ్వరరావు, కర్రి చినబాబు, వరగోగుల రుద్రయ్య, మర్రెడ్డి రమేష్, వనమాలి బాలాజీ, కట్టా శివ తదితరులు పాల్గొన్నారు.

### కళాగౌతమి 2వ రోజు వార్షికోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 28: కళాగౌతమి రెండవ రోజు వార్షికోత్సవాలను ప్రముఖ విద్యావేత్త జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపకులు బీవీఎస్‌మూర్తి మాట్లాడుతూ,కళాగౌతమి స్థాపించిన దగ్గర నుంచి కవులందరి సహాయసహకారాలను మరువలేమని, ముఖ్యంగా సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వారణాసి సుబ్రమణ్యం సేవలు గణనీయమైనవని అన్నారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇక్కడ ప్రతివారు తనకు సోదర సమానులని, సాహిత్యమంటే తనకు ఎనలేని ప్రేమన్నారు. ఈ ముఖ్యఅతిథి సుబ్రమణ్యం మాట్లాడుతూ కళాగౌతమి వ్యవస్థాపకుల నుంచి తాను ఎన్నో విషయాలు నేర్చుకొన్నానని వారి చేతుల మీదుగా ఎన్నో సాహితీ కార్యక్రమాలు జరిగాయని, ఆ బాధ్యతతోనే, తాను భాగ్యనగరం నుంచి వచ్చానని తెలిపారు. ఈ కార్యక్రమానికి,టి.జయప్రద, పొట్టి శ్రీరాములు, విశ్రాంత న్యాయమూర్తి ఎస్సార్ పృధ్వీ, వి.కృష్ణమోహన్, జోరాశర్మ, మల్లెమొగ్గల గోపాలరావు, సినీగేయ రచయిత దేవవరపు నీలకంఠరావు, సత్యానారాయణ, బేతా శారదాదేవి, కెసౌందర్య, బి.శ్రీలత, ఓబులేసు పాల్గొన్నారు.

### వీవోఏపై జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు

కడియం, ఆగస్టు 28: కడియపులంక పంచాయతీ పరిధిలో వీవోఏ చేతివాటం ప్రదర్శించారంటూ సాయిమణికంఠ డ్వాక్రా సంఘ సభ్యులు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. వారు ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం తాము కడియం యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా రుణం తీసుకున్నామన్నారు. తదుపరి ప్రతీనెలా చెల్లించాల్సిన వాయిదాను వీవోఏ పోలిశెట్టి నాగమణి బ్యాంకుకు చెల్లిస్తామంటూ ప్రతీనెలా తమ వద్ద తీసుకున్నారన్నారు. రుణానికి సంబంధించిన చెల్లింపులు చెల్లించడంలేదని బ్యాంకు ద్వారా మా గ్రూప్ సభ్యులకు సమాచారం తెలిసిందన్నారు. దీనిపై వీవోఏను ప్రశ్నించగా మాపై ఎదురుదాడికి దిగుతున్నారన్నారు. సదరు వీవోఏపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సొమ్మును రికవరీ చేసి బ్యాంకుకు జమ అయ్యేలా చూసి తమకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్‌కు, డీఆర్‌వోకు, కడియం పోలీస్‌స్టేషన్‌లో తాము ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు పత్రంలో సంతకం చేసిన వారిలో ప్రగడరెడ్డి ఉమాదానేశ్వరి, కోలా వీరలక్ష్మి, ప్రగడరెడ్డి లక్ష్మి, పి సత్య, పుల్లా సత్యశ్రీ, ర కుర్తి లక్ష్మి, ఎం విజయ, ఆళ్ళ నాగరత్నం, ఆళ్ళ అనంతలక్ష్మి, కోలా గంగారత్నం ఉన్నారు.

### 7 నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం

దివాన్‌చెరువు, ఆగస్టు 28 : దివాన్‌చెరువులో ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంవద్ద వినాయకచవితి మహోత్సవాలు సెప్టెంబరు 7వ తేదీ నుంచి ప్రారంభమై 16వరకూ జరుగుతాయని స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయ సముదాయాల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. . ఈఉత్సవాలలో భాగంగా 9న శ్రీలక్ష్మీగణపతి స్వామి కల్యాణం, 13న స్వామివారి సదస్యం, శ్రీపుష్పయాగం, 16న స్వామివారి ఊరేగింపు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

### అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా నిరసన

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28 : అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా వాణిజ్య పన్నులశాఖ ప్రాంతీ య కార్యాలయం వద్ద ఏపీ కమర్షియల్ ట్యాక్స్ సర్వీస్ అసోసియేషన్ నిరసన ధర్నా చేసింది. బుధవారం రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాయలం వద్ద జరిగిన ధర్నాలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టీ.శ్రీరామ్, వి.రత్నకుమార్‌లు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖలో గత యేడాది రాష్ట్రపతి ఉత్తర్వులను కాలరాస్తూ రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి శాఖల పునర్వ్యవస్థీకరణ పేరుతో జరిగిన బదిలీలను, యూనిట్ ఆఫ్ అపాయింట్మెంట్ నుంచి వేరే డివిజన్ కు ఆర్డర్ టు సర్వ్ పేరిటి జరిగిన అక్రమ బదిలీలను ఖండిస్తున్నామన్నారు. ఈనిరసనలో కమర్షియల్ ట్యాక్స్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### 30న ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో వనమహోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28 : వనమహోత్సవం - 2024 మొక్కలు నాటే కార్యక్రమం ఈనెల 30వ తేదీ ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు జిల్లాఅటవీ శాఖ అధికారి బి.నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

### స్వీడన్ మేయర్‌ను కలిసిన లారెల్ హైగ్లోబల్ స్కూల్ మేనేజ్‌మెంట్

రాజమహేంద్రవరం సిటీ, ఆగ స్టు 28: రాజమహేంద్రవరం గాడాలలోని లారల్ హైగ్లోబల్ స్కూల్ సీనియర్ మేనేజ్‌మెంట్ అట్లాస్ ప్లానింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్టూడెంట్స్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలను ప్రోత్సహించడానికి స్వీడన్ సందర్శిస్తోంది. లారెల్ హైగ్లోబల్ స్కూల్ సీనియర్ మెనేజ్‌మెంట్ బృందం లింకోపింగ్ మేయర్ మికాయెల్ సాన్‌ఫ్రిడ్‌సన్‌ను కలిశారు.

### ప్రమాదకరంగా మారిన నుయ్యి పూడ్చివేస్తాం

**● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**


నుయ్యిను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28: రాజమహేంద్రవరం 8వ డివిజన్‌లో ప్రమాదకరంగా మారిన నుయ్యిని పూడ్చి వేసేందుకు చర్యలు చేపట్టామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రకాష్‌నగర్ రౌండుపార్కులో వినాయకుడి ఆలయాన్ని అనుకుని ఉన్న నుయ్యి గతంలో సొసైటీ వారు ఏర్పాటు చేశారని ఇది పురాతన నుయ్యి అన్నారు. ప్రస్తుతం నుయ్యి, ప్రమాదకరంగా ఉండటంతో దానిని బుధవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు, శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావుతో కలిసి పరిశీలించారు. ఈ నుయ్యి ప్రమాధకరంగా మారిందని అందువలన దీనిని పూడ్చివేయాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### ఘనంగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28 :రాజమహేంద్రవరం 37వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ పెనుగొండ విజయభారతి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగిసాయి. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ , టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, సీసీసీ ఎండీ పంతం కొండలరావులు ముఖ్యఅతిథులుగా హజరయ్యారు. ఉట్టిలాగి ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషదారణలో చిన్నారులు అలరించారు.

### రోప్ స్కిప్పింగ్‌లో పందలపాక విద్యార్థుల ప్రతిభ



బిక్కవోలు, ఆగస్టు 28: పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల కర్నూలు జిల్లా గార్గేయపురంలో జరిగిన రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మూడు బంగారు, ఏడు రజత పతకాలు సాధించారు. వీరిని అభినందిస్తూ బుధవారం కొమరిపాలెంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ మాజీ అధ్యక్షుడు పడాల రామారెడ్డి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. వీటిని అందుకున్న వారిలో ఏ. అశ్వంత్, ఎం.భరత్, జి. దేవానంద్, ఎన్.సతీష్, బి. దుర్గాప్రసాద్, ఎస్. ప్రేమ్‌కుమార్, ఆర్.రాకేష్, బి.మనోజ్, ఎం.విజయ్, జి.సాయి ఉన్నారు. రోప్ స్కిప్పింగ్ కోచ్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

### మండలస్థాయి ఫిర్యాదులు తొలుత పరిష్కరించాలి

**● ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాధబాబు**

దివాన్‌చెరువు, ఆగస్టు 28: ఉపాధ్యాయుల పనిసర్దుబాటు ప్రక్రియలో తొలుత మండలస్థాయి ఫిర్యాదులు అన్నీ పూర్తిచేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాధబాబు కోరారు. ఆ తర్వాతే డివిజన్‌స్థాయిలో ఈ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండలస్థాయిలో చాలా ఫిర్యాదులు పరిష్కారం కావలసి ఉందన్నారు. రోస్టర్ పాయింట్ ఆధారంగా సీనియారిటీపై ఫిర్యాదులు, ఇతర విజ్ఞప్తులు ఉన్నాయని చెప్పారు. మండలస్థాయి పనిసర్దుబాటు పూర్తయిన తర్వాత డివిజన్‌స్థాయి గ్రీవెన్సెస్ కూడా పరిష్కారం చేశాకే డివిజన్‌స్థాయి పని సర్దుబాటు చేయాలని కోరారు. ఈమేరకు పాఠశాల విద్యా కమిషనర్‌కు ప్యాప్టో ప్రాతినిధ్యం చేసిందని త్రినాధబాబు తెలిపారు.

## విజయగణపతి చవితి ఉత్సవాలకు శ్రీకారం



అనపర్తి, ఆగస్టు 28 : అనపర్తిలోని టీటీడీ కళ్యాణ మండపం సమీపంలోని రావిచెట్టువద్ద ఉన్న విజయగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలకు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన వెలగల గంగిరెడ్డి కనకదుర్గాలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి రాట మంచి చేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు కర్రి రామారెడ్డి మాట్లాడు తూ చవితి ఉత్సవాల సందర్భంగా నవరాత్రులలోను ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కమిటీ ప్రతినిదులు మండ రామారెడ్డి, వోగిరెడ్డి సత్తిరెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి, డాక్టర్ తేతలి అరుణ వీర్రెడ్డి దంపతులు, కర్రి సుధాకరరెడ్డి, పారిశ్రామికవేత్త తేతలిరాధాకృష్ణారెడ్డి, తేతలి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

### ఘనంగా గణనాథుడి రాటమహోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు28: స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద గల గణపతి ఉత్సవాలకు ఏంతో ప్రాముఖ్యముందని, అందుకు అనుగుణంగానే ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుష్కరాల రేవు వద్ద, గణపతి నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవ రాట ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బైర్రాజు ప్రసాద్ రాజు, శ్రీకన్యరాజు, కొమ్ముల సాయి,కరుణామయుడు శ్రీను, బోసు నీడిగట్ల బాబ్జీ, అడపా అనిల్ పాల్గొన్నారు.

### చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

రాజానగరం, ఆగస్టు 28: వచ్చేనెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో భాగంగా మండల పరిధిలో ఏర్పాటుచేసే మండపాలకు అధికారుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ ఎన్.లక్ష్మీ లావణ్య తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని వినాయక ఉత్సవ కమిటీలు వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన, ఊరేగింపు, నిమజ్జనం నిమిత్తం సింగిల్ విండో సిస్టమ్ ద్వారా ముందుస్తుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారుల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 29 ఆగస్టు 2024 | 5




# సెబ్ పోయే.. ఎక్సైజ్ వచ్చే..

» స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రద్దు » మళ్లీ పాత ఎక్సైజ్ విధానమే అమలు » కేబినెట్ నిర్ణయం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) రద్దయింది. దీని స్థానంలో తిరిగి ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ పునరుద్ధరిస్తున్నారు. 2020లో వైసీపీ ప్రభుత్వం ఎక్సైజ్‌ను నిర్వీర్యం చేసి సెబ్‌ను తెరమీదకు తెచ్చిన సంగతి తెలిసిందే. ఈ డిపార్ట్‌మెంట్‌కు రెండు ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి. మద్యం తాగడం నియంత్రించడం, వినియోగం తగ్గించడం, అక్రమ మద్యం అమ్మకాలు లేకుండా చూడడంతోపాటు నాటుసారా లేకుండా చేయడం వంటివి ఓ లక్ష్యం కాగా, ఇసుక అక్రమాలు జరగకుండా చూడడం మరొక లక్ష్యం. కానీ ఇసుక, గంజాయి వంటి విషయాల్లో కేసులు పెట్టి అరెస్టు చేసే అధికారం సెబ్‌కు లేదు. కేవలం నాటుసారా వరకూ మాత్రం అరెస్టు చేసే అధికారం ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఏం చెప్పిందంటే ప్రజలు భౌతికంగా, ధృడంగా, ఆరోగ్యంగా జీవించడం కోసం మద్యం నియంత్రణకు ఈ డిపార్ట్‌మెంట్ తెస్తున్నట్టు చాలా గొప్పగా చెప్పింది. కానీ కేవలం వైసీపీ ప్రభుత్వం చెప్పినట్టు నడుచుకోవడానికే సెబ్‌ను తెచ్చినట్టు క్రమేణా అందరికీ అర్థమైంది. గతంలో ఉన్న ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ విధానాన్ని మార్చేసి ఆ ఉద్యోగులను సెబ్‌లోకి మార్చారు. జిల్లాకు ఒక ఏఎస్పీ స్థాయి అధికారితోపాటు 8 మంది సీఐలు, 10 మంది ఎస్ఐలు, 13 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 51 మంది కానిస్టేబుళ్లు ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ సెబ్‌కు పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వకపోవడంతో కేవలం పేరుకే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా మిగిలింది. గత ప్రభుత్వం చేసిన తప్పులను, దోపిడీని చూసీచూడనట్టు వదిలేయడమే వీరి పనిగా మారింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశంలో సెబ్‌ను రద్దు చేసి, ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించడానికి నిర్ణంచారు. అనంతరం సెబ్‌ను రద్దుచేస్తూ ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. దీంతో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అమలులోకి రానుంది.. జిల్లాకు ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, పోస్టులను ఇవ్వనున్నారు. అంతేకాక అసిస్టెంట్ కమిషనర్ పోస్టు కూడా రానున్నట్టు చెబుతున్నారు. ఇక సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఆఫీసు స్టాఫ్ మామూలే. సెబ్ ఉన్నప్పుడు మద్యం షాపుల జోలికి వెళ్లలేదు. ఇక ఎక్సైజ్ ఆధ్వర్యంలో కొత్త మద్యం పాలసీ రానుంది. కానీ రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఉండేది. సొంత భవనాలుండేవి. వాటిని గత కలెక్టర్ తొలగించి, ప్రత్యేక సమావేశాలకు క్యాంపు ఆఫీసు నిర్మించారు.

# ఉల్లి.. కొంటే కన్నీళ్లే!

» మహారాష్ట్రలో భారీ వర్షాలతో కొత్త పంటకు తీవ్ర నష్టం.. పడిపోయిన దిగుమతులు

» మరో రెండు నెలలు ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా » రైతు బజార్లలోనే కిలో రూ.48, బహిరంగ మార్కెట్లో ఏకంగా రూ.70 పైనే

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28: ఉల్లిపాయలు... కొనాలంటేనే కాదు, వాటి ధరలు విన్నా కూడా కన్నీళ్లే అన్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్లతోపాటు బహిరంగ చిల్లర మార్కెట్లలో ఉల్లిపాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లి ధరల దూకుడు చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. కర్నూలు ఉల్లిపాయలు మార్కెట్లకు రాకపోవడం, మహారాష్ట్ర ఉల్లిపాయలపైనే అంతా ఆధారపడాల్సి రావడంతో ధరల పెరుగుదలకు అడ్డూ అదుపూలేకుండా పోయింది. మహారాష్ట్రలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొత్త పంట చాలా వరకూ దెబ్బతినడంతో ఉల్లిపాయల లోడులు పెద్దగా రావడంలేదని, దీంతో మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేక ధరలు పెరుగుతున్నాయని ఇక్కడి హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. మహారాష్ట్ర ఉల్లిపాయలు తప్ప మనకు మరో గత్యంతరం లేకపోవడంతో పెరిగిన ధరల భారాన్ని ప్రజలు మోయకతప్పడంలేదు. రాజమహేంద్రవరంలోని రైతు బజార్లలోనే ఉల్లిపాయలు కిలో రూ.48కు విక్రయిస్తున్నారంటే ధరల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఇక బహిరంగ మార్కెట్లలో వ్యాపారులు టైమింగ్‌ను బట్టి కిలో ఉల్లి రూ.60 - రూ.70 వరకూ ధర చెబుతున్నారు. ఇళ్ల దగ్గరకు తెచ్చి ఆటోల్లో విక్రయించేవారు రెండు కిలోల ఉల్లిపాయలనే రూ.120కు విక్రయించడం గమనార్హం. మొన్నటివరకూ రూ.100కు కనీసం నాలుగు కిలోలైనా ఇచ్చే ఆటోవాలాలు ధరలు భారీగా పెరగడంతో విక్రయించడం మానుకున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంలోని హోల్‌సేల్ మార్కెట్లో నెంబర్-1 ఉల్లిపాయలు కిలో రూ.45 రూ.47 మధ్య ధర పలుకుతోంది. రైతు బజార్లు, ఇతర చిల్లర మార్కెట్లలో విక్రయించే కిలో ఉల్లి హోల్‌సేల్‌లోనే రూ.40పైనే ఉంది.

● కర్నూలు పాయలు అందుకుని ఉంటే..

సాధారణంగా ఆగస్టు నెలాఖరుకల్లా మహారాష్ట్ర కొత్తపాయలు మార్కెట్లోకి నెమ్మది నెమ్మదిగా రావడం మొదలవుతుంది. ఇదే సమయంలో కర్నూలు ఉల్లి కూడా అందుకుంటుంది. వర్షాలు, ఇతర వాతావరణ మార్పులతో ఇప్పుడా పరిస్థితి పూర్తిగా తారుమారైంది. అటు మహారాష్ట్ర నుంచి కొత్తపాయలు రావడంలేదు. ఇటు కర్నూలు ఉల్లి అందుకోలేదు. ఇటీవల మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు కొత్త పంట చాలావరకూ దెబ్బతినడంతో ఆ ప్రభావం జిల్లా మార్కెట్లపై పడింది. కర్నూలులోనూ వర్షాలకు పంట దెబ్బతిన్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర నుంచి వస్తున్న ఉల్లిపాయలన్నీ పాతపాయలే. సెప్టెంబరులో మహారాష్ట్ర పాయలు వస్తే ధరలు తగ్గే అవకాశం ఉంది.

● మరో రెండు, మూడు వారాలు ధరాభారమే

ఉల్లి ధరాఘాతం మరో రెండు మూడు వారాలు ఉండొచ్చని హోల్‌సేల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్ర నుంచైనా, కర్నూలు నుంచైనా కొత్త పంట వస్తేనే తప్ప ధరలు దిగిరావని చెబుతున్నారు. అప్పటివరకూ మహారాష్ట్ర పాత ఉల్లిపాయలే మార్కెట్‌ను శాసిస్తాయి. దీంతో ధరల్లో పెరుగుదల తప్పదు. ఈ నేపథ్యంలో ఉల్లి ధరల నియంత్రణకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



సంగాయిగూడెం- చిన్నాయిగూడెం మధ్యలో అదుపు తప్పి మురుగు కాల్వలో దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

## మురుగు కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు

ఆర్టీసీ బస్సు అదుపుతప్పి మురుగుకాల్వలోకి దూసుకెళ్లిన సంఘటన ఇది. దేవరపల్లి మండలం సంగాయిగూడెం- చిన్నాయిగూడెం గ్రామాల మధ్యలో బుధవారం మధ్యాహ్నం నిడదవోలు నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిన్నాయిగూడెం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పక్కన ఉన్న మురుగు కాల్వలోకి దూసుకెళ్లి నిలిచిపోయింది. ఈ బస్సులో 40 మంది ప్రయాణిస్తున్నారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు ఎక్స్‌కవేటర్ సాయంతో బస్సును బయటకు తీశారు. వేరే బస్సులో ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు పంపించారు. - దేవరపల్లి

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి : డీఆర్వో

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి అభ్యర్థి ఎంపికకు తూర్పు, పశ్చిమ గోదావరి నియోజకవర్గాల ఎలక్టోరల్ రోల్స్‌లో నమోదుకు షెడ్యూలు జారీకానుందని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో, ఉన్నత విద్యాసంస్థల్లో ఆరేళ్లలోపు కనీసం మూడేళ్లపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారు ఓటరుగా నమోదైన మండలంలో ఎంపీడీవోకి నిర్ణీత దరఖాస్తు సమర్పించాలని డీఆర్వో సూచించారు. సెప్టెంబరు 9లోపు సర్వీసు సర్టిఫికెట్, ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్ కార్డు జతచేసి దరఖాస్తు సమర్పించాలన్నారు. దరఖాస్తుకు అవసరమైన ఫారం-19 అన్ని తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని ఆయన తెలియజేశారు




కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

## ఖరీఫ్ 2024-25 ధాన్యం సేకరణకు ముందస్తు కార్యాచరణ

ఈ-పంట నమోదు అక్టోబరు 1వ తేదీలోగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్ ఆగస్టు 28: రైతులకు కనీస మద్దతు ధర అందించడమే లక్ష్యంగా, వారి అభీష్టం మేరకే ఆయా మిల్లులకు పంపడంతోపాటు మిల్లు సామర్థ్యం మేరకు మాత్రమే మిల్లర్లకు లక్ష్యాలు ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్ల అసోషియేషన్ ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లుల సామర్థ్యాన్ని అనుసరించి లక్ష్యలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ధాన్యం సేకరణకు పౌర సరఫరాలశాఖతోపాటు రెవెన్యూ యంత్రాంగం కూడా భాగస్వామ్యం కావాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగ్‌లను గుర్తించి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ధాన్యం సేకరించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సౌకర్యం ఉండేలా రవాణా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైసుమిల్లు వద్ద ఎక్కువ సమయం వాహనాలు వేచి ఉండే అవకాశం లేకుండా మిల్లర్లు తగిన ఏర్పాట్లు చేసుకోవడంతోపాటు తగినంతగా హమాలీలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్, ఈ పంట నమోదులను అక్టోబరు 1వ తేదీలోగా పూర్తిచేయాలని జేసీ ఎస్.చినరాముడు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సబ్‌కలెక్టర్ అశితోష్ ప్రసాద్, ఆర్డీవో శివజ్యోతి, జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టరు ప్రశాంతి

## ఆర్‌బీఐ క్విజ్ పోటీలకు డిగ్రీ విద్యార్థులు నమోదుచేసుకోవాలి

జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.10 లక్షలు : కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భారత రిజర్వుబ్యాంకు స్థాపించి 90 ఏళ్ల పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న క్విజ్ పోటీలకు డిగ్రీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ని బుధవారం ఆమె ఆవిష్కరించారు. ఈ పోటీల్లో ఏ కళాశాల విద్యార్థులైనా పాల్గొనవచ్చని తెలిపారు. https://www.rbi90quiz.in వెబ్‌సైటులో రిజిస్టరు చేసుకోవాలన్నారు. కనీసం ఇద్దరు విద్యార్థులు, ఆపై ఉండేలా విద్యార్థులు బృందంగా ఏర్పడి సెప్టెంబరు 17లోపుగా నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, ద్వితీయ రూ.1.50లక్షలు, తృతీయ రూ.1 లక్ష, జోనల్‌స్థాయిలో రూ.5 లక్షలు, రూ.4 లక్షలు, రూ.3 లక్షలు, జాతీయ స్థాయి ఫైనల్ రౌండ్‌లో ప్రథమ బహుమతిగా రూ.10 లక్షలు, ద్వితీయ రూ.8 లక్షలు, తృతీయ రూ.6 లక్షలు లభిస్తాయన్నారు. పోటీల్లో పాల్గొనడానికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి నరసింహం, లీడ్‌బ్యాంకు మేనేజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎంప్యానల్‌మెంట్ కమిటీ తొలి సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28: జిల్లా స్థాయి ఎంప్యానల్‌మెంట్ కమిటీ తొలి సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశం చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తొమ్మిది డీసిల్టేషన్ రీచ్‌లను గుర్తించామన్నారు. పర్యావరణ అనుమతుల తర్వాత కార్యాచరణకు అనుగుణంగా ఇసుక తవ్వకాలు బోట్స్‌మెన్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని కోసం జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బ్యారేజీకి సంబంధించి ఫోర్‌షోర్ ప్రాంతంలో బోట్స్‌మెన్ సొసైటీలు నిర్వహించే డిసిల్టేషన్ ఆపరేషన్‌లో తవ్వకంచేసిన మెటీరియల్ రవాణా, అప్పగించే పద్ధతిపై నిర్ణయం తీసుకోవాల్సిఉందన్నారు. కాగా కమిటీలో జిల్లా స్థాయిలో జేసీ చైర్మన్‌గా, సమన్వయ్యకర్తగా గోదావరి డెల్టా సిస్టమ్ ధవళేశ్వరం చీఫ్ ఇంజనీర్ ఉంటారు. సభ్యులుగా ఈఈ గోదావరి హెడ్‌వాటర్ వర్క్స్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, డీపీవో, జిల్లా గనులు అండ్ జియాలజీ అధికారి, జిల్లా సహకార అధికారి, కొవ్వూరు సబ్‌కలెక్టర్, రాజమహేంద్రవరం రెవెన్యూ అధికారి, అన్ని మండలాల తహశీల్దార్లు నియమితులయ్యారు.

# 'సచివాలయాలు' చక్కదిద్దేలా..




ఇప్పటిదాకా దశ దిశ లేని సచివాలయ వ్యవస్థ

ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనూ గందరగోళం

సిబ్బంది సహేతుక క్రమబద్ధీకరణకు సీఎం నిర్ణయం

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల విషయంలోనే సందిగ్ధం

కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలను సమర్థవంతంగా పనిచేయించడం మొదలైంది. గాడిలో పెట్టే దిశగా ఇప్పటికే సీఎం చంద్రబాబు అత్యున్నత స్థాయి సమావేశంలో కూడా ప్రస్తావించారు. సిబ్బందిని సహేతుకంగా క్రమబద్ధీకరించి మానవ వనరులను ప్రజా సేవకు మరింత మెరుగ్గా వినియోగించుకోవాలని నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాజకీయ లబ్ధి, ప్రచార ఆర్భాటంకోసం జగన్ ఏర్పాటుచేసిన గ్రామ, వార్డు సచివాలయాలు అస్తవ్యస్తంగా మారాయి. జాబ్ చార్టుకు సంబంధం లేకుండా సొంత పనులతో వైసీపీ నేతలు పెత్తనం చెలాయించారు. దీంతో ప్రజా సేవలు కుంటుబడ్డాయి. కూటమి ప్రభుత్వం సచివాలయాల సిబ్బందితో పింఛన్లను ఇంటింటికీ పంపించడంలో ఇప్పటికే విజయం సాధించింది. దీంతో సచివాలయాలను సవ్యదిశలో పెడితే ప్రజలు మరింతగా ఉపయోగపడతాయనే వాస్తవం వెలుగు చూసింది. దీంతో అవసరమైన మేరకే సిబ్బందిని సచివాలయాల్లో ఉంచి మిగతా వారిని మాతృశాఖలకు పంపించాలని సీఎం యోచిస్తున్నారు.

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డు సచివాలయాల్లో 11 మంది సిబ్బంది అని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఆ లెక్క ఎప్పుడూ సరిపెట్టలేదు. తర్వాత ఎన్నికలకు ముందు సర్దుబాటు పేరుతో ముగ్గురికి కోత విధించి 8తో సరిపెట్టింది. ప్రస్తుతం జిల్లాలో రూరల్ మండలాల్లో 393, అర్బన్‌లో 119 సచివాలయాలు కలిపి మొత్తం 512 ఉండగా.. 8 మంది సిబ్బందికంటే తక్కువగా 116 ఉంటే, 8 మందికంటే ఎక్కువగా 262 మంది ఉన్నారు. 8 మంది సిబ్బంది ఉన్న సచివాలయాలు 134 ఉన్నాయి. వార్డు సచివాలయాలు 119 ఉన్నాయి. రూరల్ సచివాలయాల్లో 3140, అర్బన్‌లో 940 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. అత్యధిక సచివాలయాల్లో 10 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా రాజమహేంద్రవరం అర్బన్‌లో 8 కంటే ఎక్కువగా సిబ్బంది ఉన్న సచివాలయాలు 29 ఉన్నాయి. తర్వాత స్థానాల్లో కోరుకొండ-22, నిడదవోలు-21 ఉన్నాయి. కొన్నిచోట్ల పని ఒత్తిడి ఎక్కువగా ఉండడం, మరికొన్నిచోట్ల పనిలేకపోవడాన్ని ఇప్పటికే కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీంతో వారి సేవలను సమర్థవంతంగా వినియోగించుకునే పనిలో భాగంగా ఆ సంఖ్యను క్రమబద్ధీకరించాలని తాజాగా కూటమి ప్రభుత్వం సూచనప్రాయంగా నిర్ణయించింది.

● మాతృ శాఖకు ఎవరు?

గ్రామాల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్ 5), గ్రామ రెవెన్యూ అధికారి, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఫిషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. పట్టణాల్లోని సచివాలయాల్లో వార్డ్ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్, అడ్మిస్ట్రేటివ్, మహిళా పోలీస్, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్, ఎమెనిటీస్, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్, రెవెన్యూ, హెల్త్ కార్యదర్శులు, ఎనర్జీ అసిస్టెంట్‌లు ఉన్నారు. వీరి సర్వీసు రిజిస్టర్లు వగైరా అయా డిపార్టుమెంట్ల పరిధిలోనే ఉంటాయి. అయితే రూరల్ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్, హార్టికల్చర్, ఫిషరీష్ అసిస్టెంట్‌లను మాతృ శాఖలకు పంపించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఎనర్జీ అసిస్టెంట్లు సచివాలయాల్లో పనిచేయడం లేదు. దీంతో వీళ్లు విద్యుత్‌శాఖలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక వార్డు సచివాలయాల్లో అడ్మిన్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, సంక్షేమ కార్యదర్శి, శానిటేషన్ కార్యదర్శి, ఏఎన్ఎం, మహిళా సంరక్షణ కార్యదర్శులను కొనసాగిస్తారు. మిగిలిన వారిని మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖకు అప్పగిస్తారు. సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్/హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్ అసిస్టెంట్, పశు సంవర్థక సహాయకుల పోస్టులను ఇకపై రద్దు చేయనున్నారు. వారిని క్లస్టర్ విధానంలో మాతృశాఖల అధీనంలోకి తీసుకెళ్తారు.

● సందిగ్ధం ఇదేనా..!

సచివాలయాల సిబ్బంది గతంలో వైసీపీ నేతలకు అనుకూలంగా పనిచేసేలా పూర్తిస్థాయిలో వినియోగించుకున్నారు. ఆ సిబ్బందికి ఒక పని అని నిర్దిష్టంగా ఉండేది కాదు. పైఅధికారులు, వైసీపీ నాయకులు ఏది ఆదేశిస్తే అది పాటించాల్సిందే. అయితే ఇప్పుడు సీఎం చంద్రబాబు తీసుకోనున్న నిర్ణయంపై సచివాలయ ఉద్యోగుల్లోనూ ఆనందం వ్యక్తమవుతోంది. కానీ ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో అంతర్మథనం కొనసాగుతోంది. జిల్లాలోని అర్బన్ సచివాలయాల్లో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులు 85 మంది, రూరల్ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు 340, సర్వే అసిస్టెంట్లు 360 మంది ఉన్నారు. అర్బన్ సచివాలయాల్లోని ప్లానింగ్ కార్యదర్శులను మునిసిపాలిటీలకు పంపించినా రూరల్ సచివాలయాల్లోని ఇంజనీరింగ్, సర్వే అసిస్టెంట్లను ఏ శాఖకు పంపిస్తారో అనే ప్రశ్న చర్చనీయాంశమైంది. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు కేటాయిస్తారని అనుకున్నారు. అయితే వీళ్లను ఇరిగేషన్ శాఖకు కేటాయిస్తారనే వాదన నడుస్తోంది. సివిల్‌తోపాటు మెకానికల్ చదివిన వారు కూడా ఉన్నారు. అందువల్ల ఇరిగేషన్‌కి అయితే పూర్తిగా ఉపయోగపడతారని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించడంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల అవసరత పెద్దసంఖ్యలో ఉంది. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లను పెద్దసంఖ్యలో పోలవరం ప్రాజెక్టుకు కేటాయించే అవకాశం లేకపోలేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రధానంగా గ్రామాల్లోని ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, జల్‌జీవన్ మిషన్, పంచాయతీ రాజ్ వర్కులు, రోడ్లు, డ్రైన్లు, స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ వంటి ఇంజనీరింగ్ సంబంధిత నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. వీరికి ఎంబుక్ నమోదు చేసే అధికారం ఇవ్వడంతో చాలా మటుకు ఉపయోకరమైందని చెబుతున్నారు. వీటికోసం మండల ఇంజనీరింగ్ అధికారి, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆయా గ్రామాలకు రావాలంటే తాత్సారం జరిగేదని, బిల్లుల నమోదు, ఎంబుక్‌ల రికార్డింగ్ వంటికి చాలా ఆలస్యం అయ్యేవని.. ఇప్పుడు ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు అందుబాటులో ఉండడంతో ఇబ్బంది తప్పిందంటున్నారు. ఇక బదిలీల ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులకు మ్యూచువల్, రిక్వెస్టు బదిలీలు జరుగుతున్నాయి. త్వరలోనే సర్దుబాట్ల నిర్ణయం వెలువడవచ్చు.

### రూరల్‌లో సచివాలయ సిబ్బంది..

| హోదా | సంఖ్య |
|---|---|
| వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ | 376 |
| మహిళా పోలీస్ | 360 |
| డిజిటల్ అసిస్టెంట్ | 360 |
| పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్ 5) | 209 |
| గ్రామ రెవెన్యూ అధికారి | 219 |
| సర్వే అసిస్టెంట్ | 365 |
| ఇంజనీరింగ్ అసిస్టెంట్ | 347 |
| హార్టికల్చర్/అగ్రికల్చర్ అసిస్టెంట్ | 320 |
| ఏఎన్ఎం | 380 |
| వెటర్నరీ/ఫిషరీస్ అసిస్టెంట్ | 199 |

### అర్బన్‌లో సచివాలయ సిబ్బంది..

| హోదా | సంఖ్య |
|---|---|
| వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ | 114 |
| మహిళా పోలీస్ | 115 |
| అమెనిటీస్ సెక్రటరీ | 98 |
| పంచాయతీ కార్యదర్శి(గ్రేడ్ 5) | 209 |
| ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ | 117 |
| అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ | 100 |
| ప్లానింగ్/రెగ్యులేషన్ సెక్రటరీ | 85 |
| శానిటేషన్/ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ | 90 |
| రెవెన్యూ సెక్రటరీ | 116 |
| హెల్త్ సెక్రటరీ | 109 |

### జిల్లా అధికారి లేరండీ...

గ్రామ, వార్డు సచివాలయాల డిపార్టుమెంటు కొత్త వ్యవస్థ. దాంతో నిబంధనలనూ పక్కాగా రూపొందించాల్సి ఉంది. కానీ అలా జరగలేదు. సచివాలయాలు తీసుకొచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారి పోస్టును సృష్టించారు. కానీ దానికి అధికారిని నియమించకుండా డీఎల్‌డీవోలకు, డీఆర్‌డీఏ పీడీలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కాలం గడిపారు. అభివృద్ధి విభాగానికి జాయింట్ కలెక్టర్ ఉండేవారు. వారు సచివాలయ బాధ్యతలూ చూసుకొనేవారు. కానీ తర్వాత ఆ పోస్టును పట్టించుకోలేదు. పంచాయతీరాజ్‌శాఖలోని ఎండీవోలకు ప్రమోషన్ ఇచ్చి డీఎల్‌డీవోలుగా నియమిస్తారు. వారిలో సీనియర్‌ని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా అధికారిగా నియమించాలి. జిల్లాలో రెండు డివిజన్ల ఇద్దరు డీఎల్‌డీవోలకు సచివాల యాల అదనపు బాధ్యత అప్పగించారు. కానీ సచివాలయాలశాఖ ఏ డిపార్టుమెంటు పరిధో స్పష్టత లేదు. ఈ సమస్యలన్నిటికీ ప్రభుత్వం పరిష్కారం చూపే కసరత్తు మొదలెట్టింది.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

## పరిశ్రమల సేఫ్టీ ఆడిటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 28: పరిశ్రమలలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు జిల్లాస్థాయి భద్రత పర్యవేక్షణ కమిటీ సభ్యులు చురుకైన పాత్ర పోషించే క్రమంలో చెక్‌లిస్టు రూపొందించుకొని క్షేత్ర స్థాయిలో కార్యాచరణకు సిద్ధంకావాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. పరిశ్రమల భద్రతపై సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ చాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగిన తర్వాత నివారణ చర్యలు చేపట్టడంకంటే ముందస్తుగా ప్రమాదాలు గుర్తించి వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవడంపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. దీనిలో భాగంగా జిల్లా స్థాయిలోని పరిశ్రమల భద్రత కమిటీ సభ్యులతో కూడిన బృందం వివిధ పరిశ్రమలను పరిశీలించి అక్కడ చేపడుతున్న రక్షణ తదితర అంశాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. అగ్నిమాపక ప్రమాదాల నివారణకు సంబంధించి చేపడుతున్న జాగ్రత్తలు, గుర్తించిన లోటుపాట్లపై నివేదిక అందజేయాలన్నారు. స్థానికంగా ఏర్పాటుచేసిన పరిశ్రమల ద్వారా సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న పనులు ఆ ప్రాంతం వారికి ప్రయోజనకరంగా ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి జి.రవిశంకర్, కార్మిక అధికారి బీఎస్ఎన్ఎల్ వలీ, సీపీవో అప్పలకొండ, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, మార్టిన్ లూథర్‌కింగ్, అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో నటిని వేధించిన వారిపై సమగ్ర విచారణ చేయాలి : ముప్పాళ్ల

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వైసీసీ ప్రభుత్వ హయాంలో ముంబైకి చెందిన ఒక నటిని ఏపీ పోలీసులు, వైసీపీ నేతలు దారుణంగా వేధించిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు డిమాండ్ చేశారు. మహిళల హక్కులను ధ్వంసం చేసేవిధంగా పనిచేసిన వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్, పోలీస్ అధికారులు సీతారామాంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్‌గున్నిని శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. బాధితురాలికి రక్షణ కల్పించి, ఆమెపై పెట్టిన కేసులపై పునర్విచారణ చేయాలని పేర్కొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



విశేష అలంకరణలో రాధాకృష్ణులు

## ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

కొవ్వూరు, ఆగస్టు 28: శ్రీరామానంద గౌడీయమఠంలో శ్రీనందమహారాజుల ఆనంద మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు లాంచీలరేవు వద్ద ఉన్న శ్రీ రామానంద గౌడీయమఠంలో ఈనెల 16 నుంచి నిర్వహిస్తున్న శ్రీరాధా కృష్ణుల డోలోత్సవం- శ్రీకృష్ణ జయంతి మహోత్సవాలు ముగిశాయి. బుధవారం శ్రీరాధాకృష్ణులను విశేష అలంకరణ చేసి త్రిదండి శ్రీభక్తి విబుధ వామన మహారాజు, శ్రీపాద రమణకృష్ణదాసుల ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు చేపట్టారు. శ్రీపాద కృష్ణప్రసాద్ నందోత్సవంపై ఉపన్యాసం ద్వారా భక్తులకు వివరించారు. కృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## తాడిపర్రులో అఖండ అన్నసమారాధన

ఉండ్రాజవరం, ఆగస్టు 28 : మండలంలోని తాడిపర్రు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు సందర్భంగా బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివారికి పూజలు చేశారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు.

## రేపు బౌద్ధదమ్మ ఆశ్రమంలో వన మహోత్సవం

ఉండ్రాజవరం, ఆగస్టు 28: మండలం కేంద్రమైన ఉండ్రాజవరంలోని బౌద్ధ దమ్మ ఆశ్రమంలో ఈనెల 30న వనమహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి బంతి అనాలయో తెలిపారు. బౌద్ధ ధమ్మపీఠం, మైత్రేయ బుద్ధ విహారం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం పురస్కరించుకొని పండ్ల మొక్కలు, పూల మొక్కలు పంపిణీ చేస్తామని చెప్పారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ విచ్చేస్తున్నట్లు అనాలయో తెలిపారు.

## రాటపాతి చవితి ఉత్సవాలకు ప్రత్యేక పూజలు



దేవరపల్లిలో వినాయ కుడి ఆలయంవద్ద రాటపాతి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దేవరపల్లి, ఆగస్టు 28: దేవరపల్లి మెరకవీధిలో గల వినాయకుడి ఆలయం వద్ద చవితి మహోత్సవాల్లో భాగంగా గురువారం రాటపాతి ఉత్సవాల ప్రక్రియ ప్రారంభించారు. ఈ ఆలయంవద్ద 1983 నుంచి ఉత్సవాలు ఆలయ కమిటీ ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 7న వినాయక చవితి ఉత్సవాలు పురస్కరించుకుని ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మాధవరపు వెంకటరమణ, సూరిశెటి నాని, తోలేటి లక్ష్మణస్వామి, సుతాపల్లి నాగరాజు, తీగల వెంకట్రాజు, సూరిశెట్టి బాలు, ఆకుల నాని, తదితరులు పాల్గొన్నారు.

## 'ఎంపీడీవో బుజ్జి సేవలు ప్రశంసనీయం'



చాగల్లు ఎంపీడీవో ఎన్ బుజ్జిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చాగల్లు, ఆగస్టు 28: చాగల్లు ఎంపీడీవోగా ఎన్.బుజ్జి బదిలీపై వెళ్లిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమెను బుధవారం ఘనంగా సన్మానించారు. పనిచేసింది కొద్ది కాలమే అయినా అందరి అభిమానం పొంది ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారని ఎంపీపీ ఎం.వీరాస్వామి అన్నారు. జిల్లా ఉత్తమ ఎంపీడీవోగాను కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంలు పొందారని కొనియాడారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలాకుమారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీ టీసీలు, సచివాలయ సిబ్బంది వేర్వేరుగా శాలువాలు కప్పి, సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిల్లి తిరుమలరావు, ప్రెస్‌క్లబ్ తరుపున వనచర్ల వెంకటరావు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తరపున సీహెచ్.ప్రేమాచారి తదితరులు మాట్లాడారు.

## మంచినీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్, టీడీపీ నాయకులు

దేవరపల్లి, ఆగస్టు 28: ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీటి సమస్య నేటితో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చొరవతో తీరిందని సర్పంచ్ సున్నం వరప్రసాద్, టీడీపీ నాయకులు నుదురుమాటి శ్రీనివాస్ తెలిపారు. యాదవోలు శివారులో మంచినీటి కోసం మూడేళ్ల క్రితం బోరు వేశారు. వైసీపీ పాలనలో నిర్లక్ష్యం వలన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటివరకు తాగునీ టికి ఇబ్బందులు పడ్డారని నుదురుమాటి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదేశించటంతో బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్థు లు, టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## మెగా మెడికల్ క్యాంపు

కొవ్వూరు, ఆగస్టు 28 : కొవ్వూరు సంస్కృత కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం కొవ్వూరు మండలశాఖ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు మడిచర్ల రామ చంద్రరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో షుగరు, బీపీ, దంత, కంటి పరీక్షలు, ఈసీజీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పెన్షనర్స్ అధికసంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు

## భార్యను హత్య చేసిన నిందితుడి అరెస్టు

● 14 రోజులు రిమాండ్

అనపర్తి, ఆగస్టు 28 : అనపర్తిలో సంచలనం రేకెత్తించిన హత్య కేసులో భార్యను హత్య చేసిన భర్తను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తెలిపారు. అనపర్తి దరణికోట లో సోమవారం భార్య అరుణకుమారిని డంబెల్‌తో మోది హత్య చేసిన భర్త తుపాకుల సాయిని మంగళవారం రాత్రి రైల్వేస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రత్యామ్నాయ మార్గాలతో అదనపు ఆదాయం

● పూలమార్కెట్ ప్రతినిధులతో సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

కడియం, ఆగస్టు 28: పూల వ్యర్థాల నుంచి అదనపు ఆదాయం పొందడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం సాధ్యం అవుతుందని జిల్లా కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ చాంబర్‌లో కడియపులంక పూలమార్కెట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ హోల్‌సేల్ పూలమార్కెట్ నిర్వాహకులు ప్రతీ రోజు ఇరిగేషన్ కాలువలో పూలవ్యర్థాలను వేయడం ద్వారా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా పూలవ్యర్థాల నుంచి అదనపు ఆదాయం పొందడం సాధ్యం అవుతుందన్నారు. అందుకు అనేక సానుకూల అంశాలు అందుబాటులో ఉన్నాయని వాటిని అధ్యయనం చేసి కొంత పెట్టుబడి పెట్టడం ద్వారా ఆదాయ వనరుగా మార్చుకోవడం సాధ్యమవుతుందన్నారు. పూలవ్యర్థాల డంపింగ్ యార్డు ప్రతిపాదన వలన ఉపయోగం కంటే ఇబ్బంది పరిణామాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పూలవ్యర్థాలను డీకంపోస్టు చేసి సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ చేయవచ్చని తెలిపారు. కూలింగ్ ప్రాసెసింగ్ విధానంతో పూలను ఎండబెట్టడం ద్వారా వాటి రంగు పోకుండా ఉండే సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకుని దేశీయ, విదూశీ మార్కెటింగ్ చేసుకునే వెసలుబాటు ఉందన్నారు. పూల నుంచి అగరబత్తీ, సుగంధ ద్రవ్యాలు



పూల రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

తయారు చేసే విధానం ఉందని తక్కువ పెట్టుబడి పెట్టడం కోసం ముందుకు రావాలని సూచించారు. డీపీవో పూలమార్కెట్ ఏరియాలో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో పూలవ్యాపారులు గంగుమళ్ల నాగేశ్వరరావు, పి వెంకన్నబాబు, పాటంశెట్టి సత్తిరాజు, జి దుర్గారావు, టి రామకృష్ణ, ఎం.వీరబాబు, ఈ దొరబాబు, ఏ త్రిమూర్తులు, సుబ్బరాజు, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, టూరిజం ఆర్‌డీవీ స్వామినాయుడు, ఏపీఎంఐపీ పీడీ దుర్గేష్, ఎంపీడీవో కె.రత్నకుమారి, తదితరులు ఉన్నారు.

# రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే ముప్పి డి వెంకటేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, ఆగస్టు 28: గ్రామాల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని, అందుకు ఎవరు అడ్డువచ్చిన సహించేదిలేదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఎం.వీరాస్వామి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ విధానాలవల్ల, నిధులు మళ్లింపు కారణంగా గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాయన్నారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో చేయాల్సిన గ్రామాల్లోని రోడ్లు, డ్రైన్లు, పుంతరోడ్లు వంటివి నిధులు మళ్లింపుతో పనులు జరగ లేదన్నారు. పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని నిధులులేక విధులు లేక నిస్సహా యకులుగా సర్పంచ్‌లు మారిపోయారని అన్నారు. ఒక ప్రభుత్వం ప్రారంభించిన పనిని తరువాత వచ్చిన ప్రభుత్వం ముందుకు తీసుకునివెళ్లి పూర్తిచేస్తుందని. వైసీసీ ప్రభుత్వంలో ఇందుకు విరుద్ధంగా జరిగిందన్నారు. మండలానికి రూ.12 కోట్లుతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని, ప్రస్తుతం రూ.కోటి 13లక్షలు మంజూరయ్యా యని ఆపనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మిగిలిన నిధులు దశల వారీగా విడుదల అవుతాయని చెప్పారు. అధికారులు నిర్లక్ష్యం వీడి బాధ్యతతో పనిచేయాలని అప్పుడే అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయన్నారు. గత ప్రభుత్వంలో మేము కూడా నష్టపోయామని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ వారు నిడదవోలు, రాజమండ్రి వయా పంగిడి మీదుగాను, నిడదవోలు, కాకినాడ బస్సులు నడపాలని, చిక్కాల, చిక్కాలపాలెం కలవలపల్లి మీదుగా ఊనగట్ల, చాగల్లు మీదుగా రాజమండ్రి బస్సును పునరుద్ధరించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మలకుమారి, అధికారులు, ఎమ్మెల్యే వెంట టీడీపీనాయకులు నాదెళ్ల శ్రీరామ్, కోడూరి కాశీగంగాధరరావు, పాల్గొన్నారు.

# కొవ్వాడ కాల్వ ముంపు సమస్యను పరిష్కరించాలి

● మంత్రి రామానాయుడిని కోరిన ఎమ్మెల్యే మద్దిపాటి


గోపాలపురం, ఆగస్టు 28: వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్య అయిన కొవ్వాడ కాల్వ ముంపు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మద్దిపాటి తెలిపారు. కొవ్వాడ కాల్వ ముంపు ప్రభావంతో ప్రతీఏటా వర్షాకాలంలో నియోజకవర్గ పరిధిలో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని కొవ్వాడ కాల్వ లోతును పెంచి గట్టు పటిష్ఠంచేసి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు దిగువ ప్రాంతానికి తరలివెళ్లేలా ప్రక్షాళన చర్యలు చేపట్టి కాల్వకు ఆధునికీకరణ పనులు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఆయా శాఖల మంత్రులను కలిసి నియోజకవర్గంలో చేపట్టబోయే పలు అభివృద్ధి పథకాలకు తమవంతు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.



వెలగపూడి సచివాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడుకు కొవ్వాడ కాలువ సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

### రూ.25లక్షల కోట్ల బకాయిల రద్దు వెనుక
## భారీ స్కామ్

● పోలవరం అవకతవకలపై విచారణ జరపాలి
● అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 28: ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల కాలం లో రూ.25లక్షల కోట్ల బకాయిలను రద్దు చేయించడం వెనుక భారీ స్కామ్ జరిగిందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన లాంటి వారు బ్యాంకు రుణం తీసుకుంటే ముక్కుపిండి వసూ లు చేసే బ్యాంకులు బడా కార్పొరేట్ సంస్థలకు మాత్రం రుణ మాఫీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. 25లక్షల కోట్ల అప్పులను రద్దు చేయించిన వారి పేర్లను బయటపెట్టాలని కోరుతూ ప్రధాని మోదీకి, ఆర్‌బీఐ గవర్నర్‌కు లేఖలు పంపానన్నారు. పోలవరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మించాలని, బాధితులకు పునరావాసం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల్లో సీట్ల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలపై మండిపడ్డారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విచారించాలన్నారు. విశాఖ పోర్టులో పట్టుబడిన 25వేల కిలోల కొకైన్ కేసులో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. రాజ్యాం గ సవరణ జరగకుండా ఎస్సీ వర్గీకరణ చెల్లదని, అందుకే తాను సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశానన్నారు. క్రీమీలేయర్ విధానంతో అట్టడుగు దళితులు నష్టపోతారని, వచ్చేనెల 17న తన పోరాట కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు.

## క్యాన్సర్ పేషెంట్లకు సాయం అందజేత



చిడిపిలో క్యాన్సర్ పేషెంట్లకు సాయం అందజేస్తున్న సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు

కొవ్వూరు, ఆగస్టు 28 : ఇద్దరు క్యాన్సర్ పేషెంట్లకు జిల్లా సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. కొవ్వూరు మండలం చిడిపి గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు పుట్టినరోజు వేడుకలను బుధవారం లయన్‌క్లబ్ ఆధ్వర్యంలో చిడిపి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న బట్టు రాజవర్ధన్, మిద్దే కుమారిలకు వైద్యం నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా లిటిల్‌స్టార్ ఆసుపత్రి, తల్లి పిల్లల ఆసుపత్రి యాజమాన్యాల సహకారంతో గ్రామంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు యనమదల సుబ్రహ్మణ్యం, కలగర వెంకట్రావు, ఎండీ హుస్సేన్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పెనకనమెట్ట సర్పంచ్ మేకల శ్రీను, చిడిపి గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ

తాళ్లపూడి, ఆగస్టు 28 : తాళ్ళపూడి మండలం వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు దంపతులు జాతీయ ఉపకార వేతనాల పరీక్షల కోసం 20 మంది విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఇంచార్జి హెచ్ఎం సుభాషిణి, భవానీ, శ్రీనివాస్, సంధ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుకు పుస్తకాలు అందిస్తున్న ఏఎస్‌వో జోడాల దంపతులు

## నేటి నుంచి జీజీయూలో వాణి పథకంపై వర్క్‌షాప్

రాజానగరం, ఆగస్టు 28: గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో (జీజీయూ)ప్రాంగణంలోని గైట్ అటాన మస్ కళాశాలలో ఈనెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ)పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఉపకుల పతి యు.చంద్రశేఖర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వేస్ట్ బ్యాటరీ నుంచి పర్యావరణంపై పడుతున్న ఇటీవల పరిణామాలు అనే అంశంపై జీజీయూలోని పెట్రోలి యం విభాగం ఆధ్వర్యంలో ఈవర్క్‌షాప్ జరుగు తుందన్నారు. దీనికి దేశంలోని ప్రఖ్యాతిగాంచిన ధన్బాద్‌లోని ఐఐటీ ఏఎస్ఎం, వెల్లూరులోని వీఐటి, విజయవాడలోని ఎస్ఆర్ఎం, ఫిక్కీ, హైదరాబాదులోని ఎన్ఐఆర్‌డీపీ ఎంల నుంచి ప్రముఖులు హాజరై ఈవర్క్ షాప్‌లో పాల్గొని కీలకోపన్యాసం చేస్తారన్నారు.

# రాజమహేంద్రవరంలో మారుతినగర్ సుబ్రమణ్యం చిత్ర యూనిట్ సందడి

రాజమహేంద్రవరంకల్చరల్ ఆగస్టు 28: మారుతినగర్ సుబ్రమణ్యం సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షక దేవుళ్ళకు చిత్ర యూనిట్ ధన్యవాదాలు తెలిపింది. ఇప్పటి వరకు విలన్,క్యారక్టర్ యాక్టర్‌గా చేసిన రావు రమేష్ ప్రధాన పాత్రలో రూపొందిన మారుతి సుబ్రమణ్యం నవ్వుల పువ్వులు పూయిస్తూ విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. చిత్ర యూనిట్ విజయయాత్రలో భాగంగా, రాజమండ్రిలో ఈ చిత్రం ప్రదర్శిస్తున్న శివజ్యోతి థియేటర్‌కి బుధవారం సాయంత్రం విచ్చేసి సందడి చేసింది. లక్ష్మణ్ కార్య రచన, దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రావు రమేష్, అంకిత్ కోయ, ఇంద్రజ, రమ్య పసుపులేటి, అజయ్, హర్షవర్ధన్, శివన్నారాయణ, అన్నపూర్ణ తదితరులు నటించారు. పుష్ప డైరెక్టర్ సుకుమార్ భార్య తబిత సుకుమార్ ఈ చిత్రాన్ని సమర్పించారు. ఈ సినిమా ప్రమోషన్‌లో అల్లు అర్జున్ ఎంట్రీ కావడంతో ఈ సినిమా ప్రేక్షకుల దృష్టిని విశేషంగా ఆకర్షించింది. వర్ధమాన నటుడు అంకిత్ కొయ్యా, నటి రమ్య పసుపులేటి, డైరెక్టర్ లక్ష్మణ్ స్క్రీన్ దగ్గర ఏర్పాటు చేసిన వేదిక దగ్గరకు వచ్చి ప్రేక్షకులతో ముచ్చటించారు. సినిమా పంపిణీ చేసిన మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ఉదయరాజు, సత్తి సత్తి రెడ్డి చిత్ర యూనిట్‌కు స్వాగతం పలికారు. అనంతరం నటుడు అంకిత్ మాట్లాడుతూ తాను ఇంతవరకు 12 సినిమాలలో నటించినా, ఈ సినిమాతోనే తనకు మంచి గుర్తింపు లభించిందన్నారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.



రాజమహేంద్రవరంలో శివజ్యోతి థియేటర్‌కి విచ్చేసి సందడి చేసిన చిత్ర యూనిట్



గంజాయి రవాణా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

## అనంతపల్లిలో గంజాయి పట్టివేత

నల్లజర్ల,ఆగస్టు 28 : కాకినాడజిల్లా జగ్గంపేట నుంచి చెన్నైకి గంజాయి రవాణా చేస్తున్న ముఠాను నల్లజర్ల పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. బుధవారం నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్.శ్రీనివాస్ విలేఖర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రవివర్మ రమేష్, సూర్య ధనేష్ మురగన్, జీవరత్నం గణేశం, అలుగు నవిన్ పలనిస్వామి కలిసి ఐషర్ వ్యాన్‌లో 262 కేజీలు గంజాయి కొనుగోలు చేసి చెన్నైకి తరలిస్తుండగా నల్లజర్ల సీఐ శ్రీనివాస్‌కు వచ్చిన సమాచారం మేరకు అనంతపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐషర్ వ్యాన్ ముందు ఎస్కాట్‌గా ఎరుపు రంగు స్విఫ్ట్ కారు వెనుక ఐషర్ వ్యాన్ రావడంతో ఐషర్ వ్యాన్‌లో తరలిస్తున్న గంజాయి బయటపడింది. ఐషర్ వ్యాన్, స్విఫ్ట్ కారు, వారి సెల్ ఫోన్స్‌వారి వద్ద ఉన్న 3,100 నగదు సీజ్ చేసి వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో ఎస్ఐ శ్రీహరిబాబు, ఏఎస్ఐ మోహన్, హెచ్‌సీ స్టాలిన్, పృధ్విరాజు, రవికుమార్, షేక్ రసీద్, తారకేశ్వరరావు, తేజేంద్రనాథ్‌లను ఎస్పీ నరసింహ కిషోర్, డీఎస్పీ దేవకుమార్ అభినందించినట్లు చెప్పారు.

## మనుషుల అక్రమ రవాణాను నిరోధించాలి

● ఐసీడీఎస్ సీడీపీవో జయలక్ష్మి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

పెరవలి, ఆగస్టు 28 : మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని ప్రపంచంలోని ఇది అతి పెద్ద నేరంగా ఉందని ఐసీడీఎస్ సీడీపీవో జయలక్ష్మి పేర్కొన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెరవలి సీడీపీవో కార్యాలయంలో ఈ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ ప్రతీరోజూ పలువురు మహిళలు, యువతులను ఈ విధంగా అక్రమ రవాణా చేస్తున్నారని ఉద్యోగం, సినిమా అవకాశాలు కల్పిస్తామని మోసంచేసి విదేశాలకు అమ్ముతున్నారన్నారు. కోఆర్డినేటర్ శ్రావ్యశృతి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 28 సంవత్సరాలుగా పద్మశ్రీ డాక్టర్ సునీతకృష్ణన్ ఆధ్వర్యంలో మహిళా శిశుసంక్షేమశాఖ పోలీసు విద్యాశాఖ, న్యాయశాఖల సమన్వయంతో ఇప్పటివరకు 28,200 మంది అమ్మాయిలను, మహిళలను కాపాడి వారికి పునరావాసం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు లఘు చిత్రాలు ద్వా రా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ సుప్రియ, అంబర్‌సింగ్ పాల్గొన్నారు.

## ఏపీఎండీసీ ఇనుప రేకులషెడ్డు అపహరణపై ఫిర్యాదు

కొవ్వూరు, ఆగస్టు 28 : ఇసుకర్యాంపులో ఏపీఎండీసీ ఇనుపరేకుల షెడ్డు దొంగిలించిన వారిపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి తహశీల్దార్ కె. అజయబాబు తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని ఏరినమ్మ ఇసుకర్యాంపులో ఈనెల 27న గుర్తుతెలియని వ్యక్తులు ఏపీఎండీసీ సంస్థకు చెందిన ఇనుపరేకుల షెడ్డును కట్టర్ల సహాయంతో కట్‌చేసి దొంగిలించుకుపోయినట్లు వచ్చిన సమాచారంపై విచారణ చేపట్టాలని వేములూరు వీఆర్వో కేటీఆర్ఎల్ నరసింహను ఆదేశించామన్నారు. వీఆర్వో బుధవారం సంఘటనా స్థలానికి వెళ్లి విచారించగా ఇనుపరేకుల షెడ్డు అపహరించినట్లు గుర్తించారు. మట్టా శివ అనే వ్యక్తి నుంచి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఇనుపరేకుల షెడ్డు కట్టర్ సహాయంతో కట్‌చేసి దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వో నరసింహ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## 2 నుంచి రెవెన్యూ సదస్సులు

గోపాలపురం, ఆగస్టు 28: మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 2 నుంచి రెవెన్యూశాఖ ఆదేశాల మేరకు గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ కే.ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతుల తమ సమస్యలను రెవెన్యూ సదస్సులో సమర్పిం చాల్సిందిగా ఆయన కోరారు. 2నుంచి 30వ తేదీ వరకు ఈ సదస్సులు జరుగుతాయన్నారు.

## కార్యకర్తల కృషి అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న పిప్పర రవి

పెరవలి, ఆగస్టు 28 : గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు వేధింపులు తట్టుకుని జనసేన కార్యకర్తలు పార్టీ కోసం పనిచేశారని మండల జనసేన అధ్యక్షుడు పిప్పర రవి పేర్కొన్నారు. కాపవరంలో జనసేన నాయకుడు నందిప శ్రీనివాస చక్రవర్తి సహకారంతో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మంత్రి కందుల దుర్గేష్ కార్యకర్తలకు అండగా ఉంటారని గత ఎమ్మెల్యే ఎన్నికల్లో కాపవరంలో దుర్గేష్‌కు అధిక మెజార్టీ వచ్చిందని కార్యకర్తలను ప్రసంసించారు. ఈ కార్యక్రమంలో అరిగెల సత్తిపండు, పువ్వుల అరికృష్ణ, అడపా పెద్దబ్బులు, సునీల్, పవన్, వంశీ, జానకిరామ్ పాల్గొన్నారు.

## సినిమా గైడ్

**కొవ్వూరు**

| | |
|---|---|
| యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్1 | మిస్టర్ బచ్చన్ |
| వై.స్క్రీన్2 | తంగలన్ |
| దేవిశ్రీ(గాయత్రి | డబుల్ ఇస్మార్ట్ |
| అనన్య | ఆయ్ |

**నిడదవోలు**

| | |
|---|---|
| వీ మ్యాక్స్ | డిమాట్ కాలనీ |
| రాధాకృష్ణ | తంగలన్ |
| శ్రీగణపతి | ఆయ్, కమిటీ కుర్రోళ్లు |

**దేవరపల్లి**

| | |
|---|---|
| శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్ | మిస్టర్ బచ్చన్ |
| త్రినాథ్ సినీ మ్యాక్స్ | డబుల్ ఇస్మార్ట్ |